بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

www.akhbarbadrqadian.in

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

సంపుటి: 7
సంచిక : 33
వార్షిక చందా 600/-రూ॥

18 ఆగష్టు 2022 క్రీ, శ. 19 మొహర్రం 1444 హి,ఖ. 18 జహూర్ 1401 హి, శ.

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

رَبَّنَا لَا تُزِغۡ قُلُوۡبَنَا بَعۡدَ اِذۡ هَدَيۡتَنَا وَهَبۡ لَنَا مِنۡ لَّدُنۡكَ رَحۡمَةً ۚ اِنَّكَ اَنۡتَ الۡوَهَّابُ ۝٩

**అనువాదం: ఓ మాప్రభువు! నీ ఉపదేశము మేము పొందిన తరువాత మా హృదయములు చంచలములు కాకుండు గాకా!. మాకు నీ అనుగ్రహమును ప్రసాదించుము. నిశ్చయముగా నీవే వర ప్రదాతవు. (అలే ఇమ్రాన్: 09).**

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనాల కొరకు, వారి ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ ను అనుక్షణం రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*

اَللّٰهُمَّ اَيِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ وَبَارِكۡ لَنَا فِيۡ عُمُرِهٖ وَاَمۡرِهٖ

అందుకే అల్లాహ్ తాలా మీ నోటిని అదుపులో పెట్టుకొని మాట్లాడండి ........గాని అర్థరహితంగా, అసందర్భంగా, అనవసరంగా ఏమియు మాట్లాడకూడదని తెల్పినాడు.

**(హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఉపదేశములు:-)**

మొత్తానికి ఈ విషయాలన్నింటి ద్వారా తెలియున దేమనగా, నిజమైన నిష్టాపరత లేకుండా అసలైన సంతోషం, సౌకర్యం లభించవు. నిష్టాపరతకు చెందిన అనేక శాఖలు ఉన్నాయనే విషయాన్ని కూడ తెలుసు కోవాలి. అవి సాలేపురుగు గూడుకు ఉన్నటు వంటి సన్నని దారాల వలే విస్తరించి ఉన్నాయి. నిష్టాపరత మానవ ఆత్మలన్నింటికి, సంభాషణల సిద్ధాంతాలకు, సుగుణాల వంటి ప్రవర్తనలను అనుబంధమై ఉంటుంది. నోటి వాక్కు అనేది అతి సున్నితమైన వ్యవహారం. కొన్ని సార్లు నిష్టాపరతను వీడి ఒక వాక్కును పలుకడం జరుగుతుంది. ఆపై నేను ఇలా అన్నాను, అలా అన్నాను అని మనస్సులో సంతోష పడుతాడు. నిజానికి అది చెడువాక్యమై ఉంటుంది. ఈ సందర్భమున నాకు ఒక కథ గుర్తుకొచ్చింది. ఒక మహాత్మున్ని ఒక ప్రాపంచికుడు ఒకసారి విందుకు పిలిచాడు. ఆ మహాత్ముడు భోజనానికి అతని ఇంటికి వెళ్ళగా అక్కడ ఆ గర్వితుడైన ప్రాపంచికుడు తన సేవకునితో నేను మొదటిసారి హజ్ యాత్ర నుండి తీసుక వచ్చిన ఫలాన పల్లెమును తీసుకురా! అని అన్నాడు. ఆ తరువాత మరల నేను రెండవ సారి హజ్ నుండి తీసుక వచ్చిన ఫలాన పల్లెమును తీసుకురా! అని అన్నాడు. ఆ తరువాత నేను మూడవ సారి హజ్ నుండి తీసుకవచ్చిన ఫలాన వస్తువును తీసుకురా! అని అన్నాడు. అప్పుడు ఆ మహాత్ముడు నీవు చాలా అమాయకుడిగా కనిపిస్తున్నావు. నీవు మాట్లాడిన ఈ మూడు మాటల వలన నీ మూడు హజ్‌ల ప్రతిఫలాలను నాశనం చేసుకున్నావు కదా!. నీవు మూడు హజ్‌లు చేశావనే విషయాన్ని బహిర్గతం చేయడానికే కదా ఇలా చేశావు అని అన్నారు. అందుకే అల్లాహ్ తాలా మీ నోటిని అదుపులో పెట్టుకొని మాట్లాడండి అని బోధిస్తున్నాడు. అంతేగాని అర్థరహితంగా, అసందర్భంగా, అనవసరంగా ఏమియు మాట్లాడకూడదని తెల్పినాడు. (మల్ఫూజాత్ సంపుటి 1, పుట 381, ప్రచురణ 2018 ఖాదియాన్)

**మానవులు ఏ కాలంలోనైన ఈ భూమి మీద జీవించిన కూడ వారి ఆత్మలన్నియు ఏకం చేయబడుతాయి. అప్పుడు ప్రతీకాలపు ప్రవక్త ను వారి ముందుకు తీసుకరావడం జరుగు తుంది. వారు తమ జాతిని గూర్చి సాక్ష్యాన్ని ఇస్తారు.**

సయ్యదినా హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ అన్హు అన్నహల్ అధ్యాయపు 85 వ సూక్తి **వయౌమ నబ్అసు మిన్ కుల్లి ఉమ్మతిన్ షహీదన్ సుమ్మ లా యూజను లిల్లజీన కఫరూ వలా హుం యున్‌తఅతబూన్** ను విశ్లేషిస్తూ ఇలా తెలిపారు: అతి పెద్ద నేరాన్ని గూర్చి ప్రస్తావించిన తరువాత మరల పరలోక జీవితాన్ని ఆధారం చేసుకొని ఈ ప్రపంచంలో అట్టి నేరానికి శిక్ష పడినకూడ పరలోకంలో ఇంతకు రెట్టింపు స్థాయిలో శిక్షించబడు తారు అని తెల్పడం జరిగింది. అదే విధముగా ఆ శిక్ష మరియు ఆ అవమానాలు చాలా కఠినముగా ఉంటాయి. ఎందుకనగా మానవులు ఏ కాలంలోనైన ఈ భూమి మీద జీవించిన కూడ వారి ఆత్మలన్నియు ఏకం చేయబడుతాయి. అప్పుడు ప్రతీకాలపు ప్రవక్త ను వారి ముందుకు తీసుకరావడం జరుగు తుంది. వారు తమ జాతిని గూర్చి సాక్ష్యాన్ని ఇస్తారు. మరి అలాంటప్పుడు వీరికి అక్కడ జరిగే అవమానాన్ని గూర్చి వీరు ఎందుకు చింతించడం లేదు. మరొక చోట ఈ అవమానంను గూర్చి ఈ క్రింది పదాలలో తెలుపడం జరిగింది. **ఫకైఫ ఇజా జిఇనా మిన్ కుల్లి ఉమ్మతిన్ బి షహీదిన్ వ్వ జిఇనా బిక అలా హాఉలాఇ షహీద.......... యౌమ ఇజిన్ యవద్దు ల్లజీన కఫరూ వ అసవూ ర్రసూల లౌ తుసవ్వా బిహిముల్ అర్జు** (నిసా) అనగా జాతులన్నింటిని మరియు ప్రవక్తలందరిని ఏకం చేసినప్పుడు ఆ సమయంలో భూగోళం బద్దలై అందులో సమాధి అయినచో ఎంత బాగుండునో అనే అంతగావారు సిగ్గుతో తల దించుకుంటారు.

ఈ సూక్తి ద్వారా కూడ అల్లాహ్ తాలా ప్రతి జాతిలో ఒక ప్రవక్తను అవతరింపజేశాడు అనే విషయం తెలుస్తుంది. పవిత్ర ఖుర్ఆన్ కూడ ఈ సిద్ధాంతాన్ని అనేక సూక్తుల ద్వారా తెలియజేసింది. ఈ విషయంలో ఈ ధర్మం ఇతర ధర్మాల కంటే భిన్నముగా ఉన్నది, ఈ ధర్మ సత్య నిదర్శనాలలో ఇది అత్యంత గొప్ప సత్యనిదర్శనం.

ఆ రోజున అవిశ్వాసులకు ఏ విధమైన అనుమతి ఉండదు అని తెల్పడం జరిగింది. అందుకు కొందరు వారికి మాట్లాడే అవకాశాన్ని ఇవ్వబడదు అని పేర్కొన్నారు కాని ఇది నిజం కాదు. ఎందుకనగా పవిత్ర ఖుర్ఆన్‌లోని అనేక సూక్తులు ప్రళయ దినమున అవిశ్వాసులు అల్లాహ్‌తో మాట్లాడుతారని, తమ తప్పిదాలకు గల కారణాలను వివరిస్తారని కూడ తెల్పుచున్నాయి. కావున ఈ లా యుఅజన యొక్క అర్థం, స్వర్గంలోకి ప్రవేశించుటకు అనుమతి లేదా వారి కొరకు సిఫారిస్సు చేయుటకు అనుమతి లేకపోవచ్చును అయి ఉండ వచ్చును. దీని భావమేమనగా, ప్రళయ దినమున ప్రవక్తలందరు తమ జాతికి చెందిన అసంపూర్ణ విశ్వాసం గల ప్రజల కొరకు సిఫారిస్సులు చేయు అనుమతిని పొంది ఉంటారు. కాని వీరు మా జాతి ప్రజలు అనే విధముగా వారి నడవడిక ఉండదు కనుక ఆ ప్రవక్తలు వీరి కోసం ఎలాంటి సిఫారిస్సులు చేయరు. వారి కొరకు సిఫారిస్సు చేయుటకు అనుమతి ఇవ్వబడదు.

(తదుపరి సంచికలో)

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

(2067) హజ్రత్ అనస్ బిన్ మాలిక్ రజియల్లాహ్ అన్హు ఇలా ఉల్లేఖించారు. మరియు వారే స్వయముగా కథనము చెప్పారు. "ఎవరైతే తన సంపదలో సంవృద్ధిని కోరుకుంటారో (ఇతరుల కంటే ఎక్కువగా సత్కార్యములు చేయు అవకాశంను పొందాలనుకుంటారో) మరియు ధీర్ఘాయుష్షును పొందాలను కుంటారో వారు తమ బంధువు మిత్రులపట్ల కనికరముతో వ్యవహరించాలి" అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తెల్పుచుండగా నేను విన్నాను.

(2070) హజ్రత్ ఆయిషా రజియల్లాహ్ అన్హా ఇలా తెలిపారు: హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ రజి ఖలీఫా అయినా తరువాత వారు ఇలా అన్నారు. " నా కుటుంబ సభ్యులకు తిండి పెట్టలేని వృత్తిని నేనే చేసేవాడిని కాదనే విషయం నా జాతి ప్రజలందరికి తెలుసు. కాని ఇప్పుడు నేను ముసల్మానుల ఉన్నతికి చెందిన కార్యక్రమానికి బాధ్యుడనైనాను. కావున ఇకపై అబూబకర్ కుటుంబ సభ్యులు బైఅత్‌మాల్ నుండి జీవనభృతిని పొందెదరు. బదులుగా (అబూబకర్) ముసల్మానుల కొరకు అట్టి ధనముతో వ్యాపారం నిర్వహించును. (వ్యాపారం ద్వారా వారి సంపదను రెట్టింపు చేయును.

(2071) హజ్రత్ ఆయిషా రజియల్లాహ్ అన్హా ఇలా తెలిపారు: రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి అనుచరులు రిజ్వానుల్లాహ్ అజ్మయిన్ వారి పనులు వారే చేసుకునేవారు. వారి నుండి చెమట వాసన వచ్చేది. అప్పుడు వారితో " మీరు స్నానం చేసుకొని వచ్చినచో బాగుండేది" అని అనేవారు. (బుఖారి సంపుటి 4, కితాబుల్ బుయూఉ ప్రచురణ 2008, ఖాదియాన్)

**ఈ సంచికలోని అంశాలు:**

1⇔ జుమా ప్రసంగం 24 జూన్ 2022 . 2వ పేజిలో..
2 ⇔ హుజూర్ అన్వర్ గారి పర్యటనల నివేదిక .....9వ పేజిలో
3 ⇔ ప్రశ్నలకు హుజూర్ అన్వర్ గారి జవాబులు. .....11వ పేజిలో.

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రొపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

హజ్రత్ అబూబకర్ రజి " నీకు మంచి జరుగ బోవుచున్నది. అల్లాహ్ తాలా నిన్ను కాపాడాలని చూస్తున్నాడు, వీరు అనగా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ ప్రవక్త. కావున నీవు వారిని అనుసరించుము. ఎందుకనగా నీవు నీవు ఇస్లాంను స్వీకరించి, హుజూర్ (స)ను అనుసరించినచో వారు నీవు అగ్ని గుండంలో పడకుండా కాపాడగలరు, కాని నీ తండ్రి మాత్రం అగ్నిగుండానికి ఆహుతి అవుతాడు " అని సమాధానం ఇచ్చారు.

హజ్రత్ ఆలా రజి ఇలా అన్నారు. ఓ ప్రజలారా! భయపడకండి! మీరు ముసల్మానులు కారా?. మీరు అల్లాహ్ మార్గంలో జిహాద్ చేయుటకు బయలు దేరలేదా?. మీరు అల్లాహ్‌కు సహాయం చేయువారు కాదా? అని అడిగారు. అందుకు వారు నిశ్చయముగా మేము వారమే అని అన్నారు. హజ్రత్ ఆలా రజి ఇలా అన్నారు. అలా అయినచో మీకు శుభవార్తనిస్తున్నాను. మీరు ఉన్న ఈ పరిస్థితిలో అల్లాహ్ ఎన్నడు మిమ్ములను ఒంటరి వాడిని చేయడు అని ధైర్యానిచ్చాడు.

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి వైభవోపేతమైన ఖలీఫా రాషిద్ హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ రజియల్లాహు తాలా అన్‌హు గారి శుభ ప్రదమైన కాలంలో తిరుగుబాటు మరియు ధర్మభ్రష్టులతో చేసిన యుద్ధాల ప్రస్తావన.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 24 జూన్ 2022, (24 ఎహ్‌సాన్ 1400 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ
أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ. اَلرَّحْمٰنِ الرَّحِيْمِ. مٰلِكِ يَوْمِ الدِّيْنِ.
اِيَّاكَ نَعْبُدُ وَ اِيَّاكَ نَسْتَعِيْنُ. اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ.
صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ.

హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ రజియల్లాహ్ తాలా అన్‌హు కాలంలో తిరుగుబాటు దారులతో చేసిన యుద్ధాల ప్రస్తావన కొనసాగుచున్నది.

7వ యుద్ధం: తిరుగుబాటుదారులకు వ్యతిరేకముగా చేయబడిన యుద్ధంను గూర్చిన వివరణలు ఈ విధముగా గలవు: హజ్రత్ ఖాలిద్ బిన్ సయీద్ బిన్ ఆస్ రజిను ధర్మభ్రష్టులు మరియు తిరుగుబాటు దారులను అణిచివేయుటకు పంపించడం జరిగింది. హజ్రత్ అబూబకర్ రజియల్లాహ్ తాలా అన్‌హు గారు హజ్రత్ ఖాలిద్ బిన్ సాయీద్ బిన్ ఆస్ రజి కొరకు ఒక పతాకమును సిద్ధం చేశారు. ఆపై వారిని సిరియా సరిహద్దు ప్రాంతపు హమ్‌ఖతైన్ నగరం వైపు పంపించారు. (తారీఖే తిబ్రి, సంపుటి 2, పుట 257, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ లిబ్నాన్ 2012)

హజ్రత్ ఖాలిద్ బిన్ సయీద్ బిన్ ఆస్ రజి గారిని గూర్చిన వివరాలు ఈ విధముగా ఉన్నాయి. వారి పూర్తి పేరు ఖాలిద్, వారిని పిలుచుకునే పేరు అబూ సయీద్, వారి తండ్రి గారి పేరు సయీద్ బిన్ ఆస్ బిన్ ఉమయ్యా కాగా, తల్లి పేరు లుబైనా బిన్తె హిబాబ్. కాని ఉమ్మే ఖాలిద్ పేరుతో ప్రాచుర్యం పొందినది. (ఉసదుల్ ఘాబా, సంపుటి 2, పుట 124, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహరూత్ 2008)(అల్ ముస్తద్రాక్ అలల్ సహీహైయిూన్ లి హాకీమ్ భాగం 5, పుట 1896, హదీస్ 5081, ప్రచురణ నజార్ ముస్తఫా అల్ బాజి, అర్రియాజ్ 2000)

హజ్రత్ ఖాలిద్ రజి చాలా ప్రారంభ కాలములో ఇస్లాంను స్వీకరించిన వారిలో ఒకరు. హజ్రత్ అబూబకర్ రజియల్లాహ్ తాలా అన్‌హు తరువాత వీరు రజి ఇస్లాంను స్వీకరించినట్లుగా, మూడవ ముస్లిం వ్యక్తి అని లేదా నాలుగవ ముస్లిం వ్యక్తి అని కొందరు చెబుతారు. మరికొందరు మాత్రం వీరు రజి 5వ ముస్లిం వ్యక్తి అని, వీరి రజి కంటే ముందుగా కేవలం హజ్రత్ అలీ బిన్ అబూతాలిబ్ రజి, హజ్రత్ అబూబకర్ రజి, హజ్రత్ జైద్ బిన్ హారిస్ రజి మరియు హజ్రత్ సయీద్ బిన్ అబూవఖాస్ రజిలు ఇస్లాంను స్వీకరించినట్లుగా చెబుతారు.

హజ్రత్ ఖాలిద్ రజి ఇస్లాంను స్వీకరించు ఘటనను గూర్చి ఈ విధముగా తెల్పుతారు. హజ్రత్ ఖాలిద్ రజి ఒక కలను చూస్తారు. అందులో వారు ఒక అగ్ని గుండం ప్రక్కన నిలబడుతారు. వారి తండ్రి వారిని ఆ అగ్ని గుండంలో వేయడానికి ప్రయత్నిస్తున్నాడు. కాని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మాత్రం వారు ఆ అగ్ని గుండంలో పడిపోకూడదని వారి నడుమును పట్టుకొని కాపాడుతుంటారు. ఈ కలను చూడగానే హజ్రత్ ఖాలిద్ రజి ఆందోళనతో మేల్కొంటారు. ఆపై దేవుని ప్రమాణం! ఇది సత్యస్వప్నమే అని అర్థం చేసుకుంటారు. ఆ తరువాత వారు రజి ఒకసారి హజ్రత్ అబూబకర్ రజిను కలిసారు. ఆ సమయంలో వారి కలను హజ్రత్ అబూబకర్ రజికు వినిపించారు. అందుకు హజ్రత్ అబూబకర్ రజి " నీకు మంచి జరుగ బోవుచున్నది. అల్లాహ్ తాలా నిన్ను కాపాడాలని చూస్తున్నాడు, వీరు అనగా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ ప్రవక్త. కావున నీవు వారిని అనుసరించుము. ఎందుకనగా నీవు నీవు ఇస్లాంను స్వీకరించి, హుజూర్ (స)ను అనుసరించినచో వారు నీవు అగ్ని గుండంలో పడకుండా కాపాడగలరు, కాని నీ తండ్రి మాత్రం అగ్నిగుండానికి ఆహుతి అవుతాడు " అని సమాధానం ఇచ్చారు. ఈ క్రమంలోనే హజ్రత్ ఖాలిద్ రజి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి వచ్చారు. ఆ సమయంలో హుజూర్ (స) మక్కాకు చెందిన అజ్‌యాద్ ప్రాంతంలో ఉన్నారు. ఈ అజ్‌యాద్ అనేది మక్కాలోని సఫా పర్వతపు శ్రేణులను అంటిపెట్టుకొని ఉన్న ఒక ప్రాంతం. ఈ ప్రాంతంలోనే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బాల్యంలో మేకలను కాసారు. హజ్రత్ ఖాలిద్ రజి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఈ విధముగా అడిగి తెలుసుకున్నారు. ఓ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం! మీరు (స) ఎటువైపు ఆహ్వానించుతున్నారు?. అందుకు హుజూర్ (స) నేను ఏకేశ్వరుడైన అల్లాహ్ వైపు ఆహ్వానిస్తున్నాను. అతనికి మరొకరు సాటి లేరు. అదే విధముగా ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం) అతని దాసుడు మరియు అతని ప్రవక్త. నీవు ఈ విగ్రహారాధనను వీడుము. అవి వినలేవు, చూడలేవు, ఎలాంటి నష్టాన్ని చేకూర్చలేవు, ఎలాంటి లాభాన్ని సమకూర్చలేవు. ఎవరు వాటిని పూజిస్తున్నారు? ఎవరు వాటిని పూజించడం లేదు అనే విషయాన్ని కూడ అవి తెలుసుకోలేవు అని హితబోధ చేశారు. అప్పుడు హజ్రత్ ఖాలిద్ రజి అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యదైవం లేదని నేను సాక్ష్యమిస్తున్నాను. అదే విధముగా మీరు (స) అల్లాహ్ యొక్క ప్రవక్త అని కూడ సాక్ష్యమిస్తున్నాను అని పలికారు. హజ్రత్ ఖాలిద్ రజి ఇస్లాంను స్వీకరించి నందున రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చాలా సంతోషించారు. ఇస్లాంను స్వీకరించిన తరువాత హజ్రత్ ఖాలిద్ రజి కొన్ని రోజుల వరకు గోప్యంగానే ఉన్నారు. హజ్రత్ ఖాలిద్ రజి ఇస్లాంను స్వీకరించిన విషయం వారి తండ్రికి తెలియగా, హజ్రత్ ఖాలిద్ రజిను పట్టుకరమ్మని ఇస్లాంను స్వీకరించని తన మిగిలిన కుమారులను పంపాడు. కావున వారు హజ్రత్ ఖాలిద్ రజిను వెతికి పట్టుకొని తమ తండ్రి వద్దకు తీసుకవచ్చారు. వారి తండ్రి హజ్రత్ ఖాలిద్ రజిను తిట్టాడు, కొట్టాడు. అతడు తన చేతిలో ఉన్నటు వంటి చేతి కర్రతో వారి రజి తలపై కర్ర విరుగునంత వరకు కొట్టాడు. ఆపై ఇలా అన్నాడు. నీవు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను అనుసరిస్తున్నావు. కాని వారి జాతియే ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం)ను మరియు వారి అడుగుజాడలో నడుస్తూ వారి పూర్వికులను మరియు విగ్రహాలను గూర్చి చెడుగా మాట్లాడేవారిని వ్యతిరేకిస్తున్నది. అందుకు హజ్రత్ ఖాలిద్ రజి దేవుని ప్రమాణం! నేను ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అడుగుజాడలో నడుస్తున్నాను అని సమాధానం ఇచ్చారు. అందుకు వారి తండ్రికి ఇంకా కోపం పెరిగింది. ఆ కోపంలోనే " ఓ

మూర్ఖుడా! నీ కంటికి కనిపించనంత దూరంగా నీకు నచ్చినచోటుకు వెళ్ళు, నేను మాత్రం నీకు అన్నంకూడ పెట్టను" అని అన్నాడు. అందుకు హజ్రత్ ఖాలిద్ రజి " ఒకవేళ నీవు నాకు అన్నం పెట్టకున్నా పర్వాలేదు. నా అల్లాహ్ నాకు చాలును, అతడే నాకు అన్నపానియాలను సమకూర్చును అని బదులిచ్చారు. ఆ తరువాత వారి తండ్రి వారి రజిని ఇంట్లో నుండి వెళ్ళగొట్టాడు. మిగిలిన కొడుకులతో మీలో ఎవరు కూడ అతనితో మాట్లాడకూడదు అని హెచ్చరించాడు. అప్పుడు హజ్రత్ ఖాలిద్ రజి అక్కడి నుండి బయలుదేరి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతోనే ఉండసాగారు. సాధారణముగా వారు రజి తన తండ్రికి కనిపించకుండా మక్కాకు చుట్టు ప్రక్కల ఉన్నటు వంటి ప్రాంతాలలోనే ఉండేవారు. ఒకవేళ కనిపించినచో ఎక్కడ ఆపుతారో, ఎంత కఠినముగా వ్యవహరిస్తారో అని ఆలోచించేవారు.

హజ్రత్ ఖాలిద్ రజి గారి తండ్రి ముసల్మానులపై చాలా దౌర్జన్యం చేసేవారు, వారితో కఠినము వ్యవహరించేవారు. పైగా అతడు మక్కాకు చెందిన ఉన్నత కుటుంబీకులలో ఒకరు. ఒకసారి అతడు చాలా అనారోగ్యానికి గురైనాడు. ఆ సమయంలో అతడు ఒకవేళ అల్లాహ్ తాలా ఈ వ్యాధి నుండి పూర్తి స్వస్థతను చేకూర్చినచో మరల ఇబ్నే అబీ కబ్షా అనగా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం దేవుని ఆరాధన మక్కాలో జరుగుకుండా చూస్తాను అని అన్నాడు. అతడు అల్లాహ్ తాలాయే అని అన్నాడో లేక తన ఆరాధ్యదైవాలలో ఏదేని దైవాన్ని ఉద్దేశించి అన్నాడో తెలియదు. కాని మొత్తానికి అతడు మరల ఇలా అన్నాడు. ఎంత కఠినముగా వ్యవహరిస్తాను అనగా ముసల్మానులందరిని ఇక్కడి నుండి వెళ్ళగొడుతాను. ఈ విషయం హజ్రత్ ఖాలిద్ రజికు తెలియగా వవారు తమ తండ్రికి వ్యతిరేకముగా ఓ అల్లాహ్! అతనికి స్వస్థత చేకూర్చకుము అని దుఆ చేశారు. కావున వారి తండ్రి ఆ అనారోగ్యంతోనే మృతి చెందాడు.

ముసల్మానులు ఎబిసీనియా వైపు వైపు రెండవసారి వలస వెళ్ళినప్పుడు హజ్రత్ ఖాలిద్ రజి కూడ వారితో పాటు వెళ్ళిపోయారు. వారితో పాటు వారి శ్రీమతి ఖుజాఇయా తెగకు చెందిన ఉమయ్య బిన్త్ ఖాలిద్ రజి కూడ ఉన్నది. అదే విధముగా హజ్రత్ ఖాలిద్ రజి గారి మరొక సోదరుడు హజ్రత్ అమర్ బిన్ సయీద్ రజి కూడ వారితోపాటే ప్రస్థానం చేశారు. హజ్రత్ ఖాలిద్ రజి ఖైబర్ యుద్ధం కాలంలో హజ్రత్ జాఫర్ బిన్ అబూ తాలిబ్ రజి తో పాటు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకున్నారు. వారు ఖైబర్ యుద్ధంలో పాల్గొనలేదు. కాని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారికోసం యుద్ధ సంపదలో నుండి భాగాన్ని ఇచ్చారు. ఆ తరువాత వారు రజి ఉమ్రతుల్ ఖజా, ఫతహ్ మక్కా , హునైన్, తాయిఫ్ మరియు తబూక్ వంటి ఇతర అన్ని యుద్ధాలలో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి ప్రయాణించారు. (ఉసదుల్ ఘాబా, సంపుటి 2, పుట 124-125, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ 2008)(ఫ్రాంగ్ సీరత్ పుట 30, జవార్ అకాడమీ కరాచి).

వారు రజి బదర్ యుద్ధంలో పాల్గొనలేదు. ఆ విషయాన్ని గూర్చి ఎల్లప్పుడు చింతిస్తుండేవారు. ఒకసారి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఇలా విన్నవించుకున్నారు. ఓ రసూలుల్లాహ్ (స)! మేము మీతో బదర్ యుద్ధంలో పాల్గొనలేదు కదా! అని వాపోయారు. అందుకు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం " ప్రజలు ఒకే ప్రస్థానం చేశారు, కాని నీవు రెండు ప్రస్థానాలు చేశావు ఇది నీకు ఇష్టం లేదా?" అని నచ్చజెప్పారు. (అత్తబ్ఖాత్ ఇబ్నే సఅద్, సంపుటి 4, పుట 75, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ 2012)

హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజి దిబాచ తఫ్సీరుల్ ఖుర్ఆన్‌లో దైవవాణిని లిఖించువారిలో హజ్రత్ ఖాలిద్ బిన్ సయీద్ రజి గారి పేరు ను కూడ వ్రాసారు. (దిబాచ తఫ్సీరుల్ ఖుర్ఆన్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 20, పుట 425)

హజ్రత్ ఖాలిద్ బిన్ సయీద్ రజిను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు యమన్ నుండి జకాత్ సేకరించుటకు అధికారిగా నియమించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పరమ పదించు వరకు వారు రజి ఆ పదవిపైనే కొనసాగారు. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతి చెందిన తరువాత వారు రజి మదీనాకు రాగా హజ్రత్ అబూబకర్ రజి వారిని మిమ్ములను ఎవరు రమ్మన్నారు? అని అడిగారు. అందుకు వారు రజి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి తరువాత నేను ఎవరితో పని చేయకూడదని నిర్ణయించుకున్నాను అని తెలిపారు. వారు రజి హజ్రత్ అబూబకర్ రజి బైఅత్ చేయడంలో కూడ ఆలస్యం చేశారని, కాని బనూహాషిం తెగవారు హజ్రత్ అబూబకర్ రజి బైఅత్ చేయగా హజ్రత్ ఖాలిద్ రజి కూడ హజ్రత్ అబూబకర్ రజి బైఅత్ చేశారని చెప్పబడుతుంది. ఆ తరువాత హజ్రత్ అబూబకర్ రజి అనేక సందర్భాలలో వారిని సైన్యాధక్షుడిగా నియమించారు.

హజ్రత్ ఖాలిద్ రజి మర్జు స్సుఫ్ఫర్ యుద్ధంలో హజ్రత్ అబూబకర్ రజి ఖిలాఫత్ కాలంలో అమరుడైనారు. మరి కొందరు మాత్రం మర్జు స్సుఫ్ఫర్ యుద్ధం హిజ్రి 14వ సంవత్సరంలో హజ్రత్ ఉమర్ రజి ఖిలాఫత్ కాలపు ఆరంభంలో జరిగిందని చెబుతుంటారు. మరి కొన్ని కథనాల ప్రకారం హజ్రత్ అబూబకర్ రజి మృతి చెందుటకు 24 రోజుల ముందు హజ్రత్ ఖాలిద్ రజి సిరియా దేశంలోని జరిగిన అజ్‌నాదైన్ యుద్ధంలో అమరులైనట్లుగా పేర్కొనడం జరిగింది. (ఉసదుల్ ఘాబా, సంపుటి 2, పుట 125, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ 2008)

తారీఖే తిబ్రిలో హజ్రత్ ఖాలిద్ రజి ధర్మభ్రష్టులకు వ్యతిరేకముగా చేసిన యుద్ధాలను గూర్చి ఈవిధముగా పేర్కొనడం జరిగింది. హజ్రత్ అబూబకర్ రజి ధర్మభ్రష్టుల ఆగడాలను అరికట్టడం కోసం పతాకములను సిద్ధం చేశారు. అందుకోసం వారు ఎన్నుకోవలసిన వారిని ఎన్నుకున్నారు. వారిలో హజ్రత్ ఖాలిద్ బిన్ సయీద్ రజిఒకరు. వీరి రజిను అమీర్‌గా నియమించకూడదని హజ్రత్ ఉమర్ రజి హజ్రత్ అబూబకర్ రజి ను అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే మీరు వారితో ఎలాంటి పని తీసుకోకూడదని కూడ సూచించారు. అందుకు హజ్రత్ అబూబకర్ రజియల్లాహ్ తాలా అన్‌హు అలా చేయకూడదని అన్నారు. హజ్రత్ ఉమర్ రజి అభిప్రాయాన్ని వ్యతిరేకించారు. హజ్రత్ ఖాలిద్ రజిను తైమాలో సహాయక సైన్యానికి అమీర్‌గా నియమించబడ్డారు. తైమా కూడ సిరియా మరియు మదీనాల మధ్యలో ఉన్నటు వంటి ఒక ప్రముఖ నగరం. కావున హజ్రత్ అబూబకర్ రజి హజ్రత్ ఖాలిద్ బిన్ సయీద్ రజిను తైమాకు వెళ్ళమని, నిర్దేశిత ప్రదేశం నుండి కదలకూడదని, చుట్టు ప్రక్కల ఉన్నటు వంటి వారికి ఇస్లాం సందేశాన్ని అందించమని, ఆ తరువాత ధర్మభ్రష్టులు కాని వారి ఇస్లాంను స్వీకరించుమని, ఎవరైన ముందుగా మీపై దాడిచేసినచో కేవలం దాడి చేసిన వారితోనే యుద్ధం చేయాలని, సాధారణముగా నా ఆదేశం వచ్చు వరకు వేచి యుండమని ప్రజలందరి ఆదేశించారు. హజ్రత్ ఖాలిద్ రజి తైమాలో నివాసం ఉన్నారు. చుట్టు ప్రక్కల ఉన్నటు వంటి అనేక గ్రామాల ప్రజలు వచ్చి వారిని కలిసారు. రోమన్‌లకు ముసల్మానుల వద్ద ఉన్నటు వంటి ఈ పెద్ద సైన్యంను గూర్చి తెలిసింది. వెంటనే అతడు తన ఆధీనంలో ఉన్నటు వంటి అరబ్‌ల నుండి సిరియా యుద్ధం కోసం సైన్యాన్ని తయారు చేయసాగాడు. హజ్రత్ ఖాలిద్ రజి రోమన్‌ల తయారిని గూర్చి అరబ్ తెగల వారు అతనికి సహాయం చేయడంను గూర్చి హజ్రత్ అబూబకర్ రజికు తెలియజేశారు. అందుకు హజ్రత్ అబూబకర్ రజి వారి కంటే ముందే నీవు యుద్ధాన్ని ప్రారంభించమని , ఏ విషయంలో ఆందోళన చెందవద్దని, అల్లాహ్ తాలా తప్పకుండా సహాయం చేస్తాడని సమాధానం వ్రాసిపంపారు.

హజ్రత్ ఖాలిద్ రజి ఈ సమాధానం లభించడంతోనే శత్రువులను ఎదుర్కొవడానికి బయలు దేరినారు. వారు రజి శత్రువుల సమీపంనకు చేరుకోగా శత్రువుల గుండెల్లో భయం పుట్టి అందరికి అందరు నలువైపులా పారిపోయారు. చెల్లాచెదురైనారు. హజ్రత్ ఖాలిద్ రజి శత్రువుల స్థావరాన్ని ఆధీనపర్చున్నారు. హజ్రత్ ఖాలిద్ రజి చుట్టు ప్రక్కల ఉన్నవారిలో అధికులు ముసల్మానులైనారు. ఈ విజయాన్ని గూర్చి హజ్రత్ ఖాలిద్‌రజి హజ్రత్ అబూబకర్ రజికు సమాచారంను అందించారు. అందుకు హజ్రత్ అబూబకర్ రజి నీవు ముందుకు వెళ్ళుము కాని నీ శత్రువులు నీ వెనుక నుండి నీపై దాడి చేయునంతగా ముందుకు వెళ్ళకుము అని ఆదేశాలిచ్చారు. (తారీఖే తిబ్రి, సంపుటి 2, పుట 331-332, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ లిబ్నాన్ 2012)(ఫ్రాంగ్ సీరత్ పుట 78, జవార్ అకాడమీ కరాచి)

చారిత్రక గ్రంథాలలో హజ్రత్ అబూబకర్ రజి ఖిలాఫత్ కాలంలో ధర్మభ్రష్టుల ఆగడాలను అణిచివేయు వ్యవహారంలో హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ రజి గారి సేవలను గూర్చి ఈ విషయాలే గలవు. ఇవి గాకుండా హజ్రత్ అబూబకర్ రజి ఖిలాఫత్ కాలంలో సిరియా విజయాల పరంపరలో వారు

అందించిన సేవలను గూర్చి తరువాత ప్రస్తావించబడును.

8వ యుద్ధం: హజ్రత్ తురైఫా బిన్ హాజిజ్ రజి గారు ధర్మభ్రష్టుల ఆగడాలను అణిచివేయుటకు అందించిన సేవలు ఈ విధముగా గలవు. హజ్రత్ అబూబకర్ రజి ఒక పతాకమును హజ్రత్ తురైఫా బిన్ హాజిజ్ కొరకు ఏర్పాటు చేశారు. ఆపై బనూ సులైం మరియు బనూ హవాజిన్ తెగల వారితో యుద్ధం చేయమని ఆదేశించారు. (తారీఖే తిబ్రి, సంపుటి 2, పుట 257, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ లిబ్నాన్ 2012)

మరొక కథనములో బనూ సులైం మరియు బనూ హవాజిన్ తెగలతో యుద్ధం చేయడానికి హజ్రత్ అబూబకర్ రజి హజ్రత్ మఅన్ బిన్ హాజిజ్‌ను పంపినట్లు గలదు. మొత్తానికి అల్లామా ఇబ్నా అబ్దుల్ బర్రిగారు అల్ ఇస్తియాబ్‌లో హజ్రత్ తురైఫా మరియు మఅన్ ల తండ్రి పేరును హాజిజ్ అని పేర్కొన్నారు. అనగా జా అనే అక్షరంతో. అల్లామా ఇబ్నే అసీర్ ఉసదుల్ ఘాబాలో హాజిజ్ అనగా ర అనే అక్షరంతో వ్రాసారు. (అల్ కామిల్ ఫిత్తారీఖ్, సంపుటి 2, పుట 208, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2006) (అల్ ఇస్తియాబ్ సంపుటి 2, పుట 326, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2010)(ఉసదుల్ ఘాబా సంపుటి 3, పుట 73, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2016)

హజ్రత్ అబూబకర్ రజి ఖలీఫాగా బాధ్యతలు చేపట్టిన తరువాత హజ్రత్ తురైఫా బిన్ హాజిజ్‌ను బనూ సులైం తెగపై అనగా ఇస్లాంను స్వీకరించిన అరబ్ తెగలవారిపై పర్యవేక్షకుడిగా నియమించారు. వీరు చాలా స్వచ్ఛత, ఉత్సాహం గల సేవకులు. వారు చేసిన ప్రసంగానికి ప్రభావితులైన అరబ్ తెగలలో ఒకటైన బనూ సులైం తెగకు చెందిన వారిలో అధికులు ఇస్లాంను స్వీకరించారు. (హజ్రత్ అబూబకర్ రజి ప్రభుత్వ లేఖలు పుట 33)

మరొక కథనములో ఈ విధముగా గలదు: ఈ కథనాన్ని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబూబకర్ రజి ఉల్లేఖించారు. బనూ సులైం పరిస్థితి ఎలా ఉండేదనగా, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పరమపదించిన తరువాత ఈ తెగకు చెందిన వారిలో అధికులు ధర్మభ్రష్టతను అవలంభించి, అవిశ్వాసులుగా మారిపోయారు. కాని ఆ తెగకు చెందిన మిగిలిన కొందరు వ్యక్తులు మాత్రం ఈ తెగపై అమీర్‌గా నియమించిన మాఅన్ బిన్ హాజిజ్ కొందరి ప్రకారం వారి సోదరుడు తురైఫా బిన్ హాజిజ్‌తో పాటు ఇస్లాంపైనే స్థిరముగా ఉన్నారు. హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ రజి తులైహా తెగవారితో యుద్ధం చేయడానికి బయలు దేరినప్పుడు హజ్రత్ అబూబకర్ రజి మాఅన్ బిన్ హాజిజ్‌కు ఇస్లాంలో స్థిరముగా ఉన్నటు వంటి బనూ సులైం తెగకు చెందిన వారిని తీసుకొని హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ రజికు సహాయాన్ని అందించుము అని తెలిపారు. హజ్రత్ మాఅన్ రజి తన బదులుగా తన సోదరుడైన తురైఫా ను అమీర్‌గా నియమించి సైన్యాన్ని తీసుకొని హజ్రత్ ఖాలిద్ రజికు సహాయం అందించుటకు బయలుదేరినారు. (తారీఖే తిబ్రి, సంపుటి 2, పుట 266, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ లిబ్నాన్ 2012)

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబూబకర్ రజి గారి మరొక కథనములో ఈ విధముగా గలదు. బనూ సులైంకు చెందిన ఒక వ్యక్తి హజ్రత్ అబూబకర్ రజి వద్దకు వచ్చాడు. అతనిని ఫుజాఅ అని అంటారు. అతని పేరు ఇయాస్ బిన్ అబ్దుల్లాహ్. ఫుజాఅ అనే పేరులో అకస్మత్తుగా అనే అర్థం వస్తుంది. ఎందుకనగా ఒక వ్యక్తి అకస్మత్తుగా బాటసారిగా లేదా నగరాలపై దాడి చేసి దోచుకపోయినచో అట్టి వారిని ఫుజాఅ అని అంటారు. మొత్తానికి హజ్రత్ అబూబకర్ రజి వద్దకు వచ్చినటు వంటి వ్యక్తి తనను తాను ముసల్మానుడిగా పరిచయం చేసుకున్నాడు. ఆపై నేను ధర్మభ్రష్టతను అవలంభించిన వారితో యుద్ధం చేయాలనుకుంటున్నాను. కావున మీరు నాకు కొంత మంది సైనికులను, వారికి కావలసిన సదుపాయాలను కల్పించి, సహకరించండి అని కోరాడు. హజ్రత్ అబూబకర్ రజి అతనికి ఆయుధాలను ప్రయాణించడానికి జంతువులను ఏర్పాటు చేశాడు. మరొక చోట ఈ అంశంను గూర్చిన వివరాలు ఇలా గలవు: హజ్రత్ అబూబకర్ రజి అతనికి రెండు గుర్రాలను మరికొన్ని కథనాల ప్రకారం 30 ఒంటెలను, 30 మంది సైనికులను వారికి సరిపడు ఆయుధాలను, మరో పది మంది ఆయుధాలను ధరించిన సైనికులను తోడుగా ఇచ్చి పంపారు. ఈ వ్యక్తి అక్కడి నుండి బయలు దేరినాడు. మార్గమధ్యలో ఎదురయ్యే ముసల్మానుల మరియు ధర్మభ్రష్టుల సంపదలను దోచుకునేవాడు. ఒకవేళ వారు ఎదురు తిరిగినచో వారిని హత్య చేసేవాడు. ఇతడు ప్రతి ఒక్కరితో ఇలాగే వ్యవహరించేవాడు. చివరికి ముసల్మానులను కూడ హత్య చేసేవాడు, ముసల్మానులు అమరులయ్యేవారు. అతనికి తోడుగా బనూ షరీద్ తెగకు చెందిన మరొక వ్యక్తి కూడ ఉన్నాడు. అతని పేరు నజ్బా బిన్ అబూ మైసా అని చెప్పుకోవడం జరుగుతుంది. మరొక కథనము ప్రకారం ఫుజాఅ తన తెగవారి వైపు బయలు దేరినాడు. మార్గ మధ్యలో ఎదురైన ప్రతి ధర్మభ్రష్టుడిని తనతోకలుపుకునేవాడు.

ఈ క్రమంలో వారి సంఖ్య అధికమైనప్పుడు అతడు ముందుగా తనతో పాటు ఉన్నటు వంటి ముసల్మానులను హత్య చేశాడు. వారి సంపదను దోచుకున్నాడు. ఆ తరువాత మరల అతడు రక్తపాతాన్ని సృష్టించాడు.

ఒకసారి ఈ తెగవారిపై దాడి చేసేవాడు, మరొకసారి ఆ తెగవారిపై దాడి చేసేవాడు. ముసల్మానుల ఒక బృందం మదీనాకు వెళ్ళుచుండగా వారిని అడ్డగించి వారి సంపదను దోచుకున్నాడు. ఆపై వారిని హత్య చేశాడు. వారందరు అమరులైనారు. హజ్రత్ అబూబకర్ రజిఈ విషయాన్ని గూర్చి తెలియగానే వారు రజి హజ్రత్ తురైఫా బిన్ హాజిజ్‌కు ఒక లేఖ వ్రాసారు. కొందరు మాత్రం హజ్రత్ అబూబకర్ రజి ఈ ఆదేశాన్ని హజ్రత్ మాఅన్ బిన్ హాజిజ్‌కు వ్రాసారని, దానిని వారు తన సోదరుడు తురైఫాకు పంపారని పేర్కొన్నారు. మొత్తానికి హజ్రత్ అబూబకర్ రజి ఇలా వ్రాసారు. దేవుని శత్రువు ఫుజా నా వద్దకు వచ్చాడు. తనను తాను ముసల్మానుడిగా పరిచయం చేసుకున్నాడు. ఇస్లాంను వీడిన వారిని ఎదుర్కొవడం కోసం సహాయం చేయండని అని వేడుకున్నాడు. నేను అతనికి గుర్రాలను, ఒంటెలను, ఆయుధాలను ఇచ్చాను. ఇప్పుడు నాకు తెలిసిన సమాచారమేమనగా ఈ దేవుని శత్రువు ముసల్మానులు మరియు ధర్మభ్రష్టుల వద్దకు చేరుకొని వారి సంపదను దోచుకుంటున్నాడు. అతనిని ఎదురించేవారిని అతడు హత్య చేస్తున్నాడు. కావున నీవు నీ వద్ద ఉన్న ముస్లిం సైన్యాన్ని తీసుకొని వెళ్ళుము. అతనిని బంధించి నా వద్దకు పంపుము. మరొక కథనములో ఈ విధముగా గలదు. హజ్రత్ అబూబకర్ రజి హజ్రత్ తురైఫాకు సహాయం అందించుటకు హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఖైస్ రజిను కూడ పంపించారు. హజ్రత్ తురైఫా బిన్ హాజిజ్ రజి అతని ఎదురించుటకు బయలు దేరినాడు. ఇరు వర్గాల వారు ఎదురు ఎదురు పడగా ముందుగా బాణాలతో పోరాడుకున్నారు. వాటిలో ఒక బాణం నజబ బిన్ అబూ మైసాకు తగలడం అతడు మరణించాడు. ఫుజాఅ ముసల్మానుల వీరత్వాన్ని చూసి హజ్రత్ తురైఫా తో ఇలా అన్నాడు. ఈ విషయంలో మీరు నా కంటే ఎక్కువ అర్హులు కాదు. నీవు హజ్రత్ అబూబకర్ రజి నియమించిన అమీర్‌వి. నేను కూడ హజ్రత్ అబూబకర్ రజి నియమించిన అమీర్‌ని. చాలా తెలివిగా అతడు ఈ యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నించాడు. అందుకు హజ్రత్ తురైఫా రజి అతనితో ఒకవేళ నీవు నా వాగ్దానంలో సత్యవంతుడవే అయినచో ముందుగా నీవు ఆయుధాలను వీడుము. నిన్ను బంధించి తీసుకరమ్మని హజ్రత్ అబూబకర్‌రజి నాకు ఆదేశాన్ని పంపాడు అని అన్నారు.

ముందుగా నీవు ఆయుధాలను వీడుము. నాతో పాటు హజ్రత్ అబూబకర్ రజి వద్దకు నడువుము. నీవు అమీర్‌వా? కాదా? అనేది అక్కడ తీర్మాణించబడును అని అన్నారు. అందుకు ఫుజాఅ హజ్రత్ తురైఫా రజితో పాటుగా మదీనాకు బయలుదేరినాడు. ఇరువురు హజ్రత్ అబూబకర్ రజి వద్దకు చేరుకున్న తరువాత హజ్రత్ అబూబకర్‌రజి హజ్రత్ తురైఫా రజితో అతనిని బఖీకి తీసుకెళ్ళి అక్కడే మంటలో పడవేయుము అని ఆదేశించాడు. ఈ విధమైన ఆదేశం ఇవ్వబడడానికి గల కారణం అతడు కూడ ముసల్మానులను ఈ విధముగానే మంటలో వేసి కాల్చేవాడు. కావున హజ్రత్ తురైఫా రజి అతనిని తీసుకవెళ్ళి మంటపెట్టి అతనిని అందులో విసిరి వేశాడు. మరొక కథనములో ఈ విధముగా గలదు. యుద్ధం జరుగుచున్న సమయంలో ఫుజాఅ పారిపోయాడు. హజ్రత్ తురైఫా రజి అతనిని వెంబడించి ఖైది చేసి హజ్రత్ అబూబకర్ రజి వద్దకు పంపారు. హజ్రత్ అబూబకర్ రజి వద్దకు చేరుకోగా, వారు రజి అతని కోసం మదీనాలో వెలుగులు విరజిమ్మేలా ఒక పెద్ద మంటను పెట్టించి, అతని కాళ్ళు చేతులు కట్టించి అందులో విసిరి వేయించారు. (తారీఖే తిబ్రి, సంపుటి 2, పుట 266, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ లిబ్నాన్ 2012)(హజ్రత్ అబూబకర్ రజి ప్రభుత్వ లేఖలు, రచయిత రషీద్ అహ్మద్ ఫారూఖ్ పుట 33-34) (ఫతూహుల్ బల్దాన్ లి

బిలాజరి అనువాదం పుట 152, ప్రచురణ నఫీస్ అకాడమీ కరాచి).

9వ యుద్ధం: ధర్మభ్రష్టులకు వ్యతిరేకముగా చేపట్టిన ఈ యుద్ధానికి హజ్రత్ అలా అ బిన్ హజ్‌రమి రజి నాయకత్వం వహించారు. హజ్రత్ అబూబకర్ రజి ఒక పతాకమును హజ్రత్ అలాఅ బిన్ హజ్‌రమి రజి కోసం ఏర్పాటు చేశారు. ఆపై వారిని బెహ్‌రైన్‌కు వెళ్ళమని ఆదేశించారు. (తారీఖే తిబ్రి, సంపుటి 2, పుట 257, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ లిబ్నాన్ 2012)

బెహ్‌రైన్ యమామ మరియు ఫారీస్‌కు చెందిన సంయుక్త ప్రాంతాల మధ్య ఉన్నది. అందులో నేటి ఖతార్ మరియు దీవిగా ఉన్నటు వంటి బెహ్‌రైన్‌కు చెందిన రాజ్యం కూడ బాగంగానే ఉండేది. నేడు ఉన్నటు వంటి చిన్న పాటి బెహ్‌రైన్ కాదు. ఆ నాడు చాలా విస్తారముగా ఉండేది. దాని రాజధాని దారీన్ ఉండేది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో ఇక్కడ ముంజిర్ బిన్ సావా అనే ఒక పాలకుడు ఉండేవాడు. అతడు కూడ ఇస్లాంను స్వీకరించాడు. ఆ రోజులలో బెహ్‌రైన్ మరియు సౌది అరబ్‌ల సంయుక్త రాజ్యాలను అల్ అహ్‌సా అని పిలుచుకునేవారు. (అట్లస్ సీరత్ నబ్వీ సల్లల్లాహు అలైహి వసల్లం పుట 68)

హజ్రత్ ఆలా బిన్ హజ్‌రమీ రజి యొక్క పరిచయం ఏమిటనగా, వీరి రజి అసలు పేరు ఆలా. వీరి తండ్రి పేరు అబ్దుల్లాహ్ . వీరు రజి యమన్‌లోని హజర్ మౌత్ ప్రాంతానికి చెందిన వారు. ఇస్లాం సందేశం అందిన ప్రారంభపు రోజులలోనే వీరు ఇస్లాంను స్వీకరించారు. హజ్రత్ ఆలా బిన్ హజ్‌రమీ రజి గారి ఒక సోదరుడు అమర్ బిన్ హజ్‌రమీ ఎలా గుర్తింపు పొందారనగా, ఒక ముసల్మానుడి చేతిలో చంపబడిన మొట్ట మొదటి అవిశ్వాసుడు. అదే విధముగా అతని సంపదలో నుండి 5వ భాగాన్ని కూడ మొదటి సారిగా ఇస్లాంలో పంచిపెట్టడం జరిగింది. బదర్ యుద్ధ ప్రధాన ఆంశంలో కొన్ని ఆంశాలు మరియు కారణాలు తెల్పబడిన ద్వారా చూసినచో ఒక కారణం చేత వారు ఆ యుద్ధంలోనే మృతి చెందారని గలదు. హజ్రత్ ఆలా బిన్ హజ్‌రమి రజి గారికి ఒక సోదరుడు ఉండేవాడు. అతడు బదర్ యుద్ధంనం అవిశ్వాస స్థితిలో మరణించాడు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చక్రవర్తుల పేరున ప్రచార లేఖలు వ్రాసిన క్రమంలో బెహ్‌రైన్ పాలకుడు ముజిర్ బిన్ సావాకు కూడ ఒక లేఖ వ్రాయగా, దానిని అతనికి చేర్చు బాధ్యతను హుజూర్ (స) హజ్రత్ ఆలా బిన్ హజ్‌రమి రజికు అప్పగించారు. ఆ తరువాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి రజినే బెహ్‌రైన్ యొక్క జకాత్ సేకరులుగా నియమించారు.

హజ్రత్ ఆలా బిన్ హజ్‌రమి రజి వారికి ఇస్లాం సందేశాన్ని అందించగా ముంజిర్ బిన్ సావా ఇస్లాంను స్వీకరించాడు. ముంజిర్ కు ఇస్లాం సందేశం అందగా అతడు ఈ విధమైన సమాధానంను ఇచ్చాడు. ఈ విషయంలో నేను చాలా ఆలోచించాను. నా చేతిలో ఉన్నదానిని చూసినచో అది ఈ ప్రాపంచికమైనదిగా తలపించింది. పరలోకానికి చెందినది ఏదియును కాదు. అనగా నా వద్ద కేవలం ప్రాపంచికతయే గలదు. పరలోకంను గూర్చి నేను ఎలాంటి ఏర్పాట్లు చేసుకోలేదు అని అర్థం.

కాని నేను మీ ధర్మంను గూర్చి ఆలోచించగా నాకు అందులో ఈ ప్రాపంచిక మరియు పరలోక ప్రయోజనాలు కనిపించాయి. అందుకే మీ ఈ ధర్మాన్ని స్వీకరించడానికి నాకు ఎలాంటి అభ్యంతరాలు లేవు.

ఇస్లాం యొక్క సత్యతను గూర్చి నాకు నమ్మకం కల్గింది. ఈ ధర్మంలో జీవించాలనే తపన మరియు మరణంను గూర్చిన ఉపశమనం గలదు. మరల ఇలా వ్రాసాడు: నిన్న ఈ ధర్మాన్ని స్వీకరించిన వారిని చూసినచో ఆశ్చర్య మేసింది. నేడు ఈ ధర్మాన్ని తిరస్కరించువారిని చూసినచో విచారం కల్గుతుంది. బోధనల గొప్పదనాన్ని చూసిన తరువాత నాలో ఆలోచనలు మారిపోయాయి. మరల ఇలా వ్రాసాడు. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం తీసుకవచ్చిన ధర్మశాస్త్ర వైభవాన్ని చూసినచో హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం వైభవాన్ని, ఘనతను కీర్తించాలని పిస్తుంది.

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పరమపదించు వరకు హజ్రత్ ఆలా రజి బెహ్‌రైన్‌కు జకాత్ సేకరులుగానే కొనసాగారు. తరువాత హజ్రత్ అబూబకర్ రజి ఖిలాఫత్ కాలంలో కూడ ఆ పదవిపైనే కొనసాగారు. హజ్రత్ ఉమర్ రజి కూడ తమ ఖిలాఫత్ కాలంలో వారిని ఆ పదవిపైనే కొనసాగించారు. చివరికి హజ్రత్ ఉమర్ రజి ఖిలాఫత్ కాలంలోనే వారు రజి మృతి చెందారు. (ఉసదుల్ ఘాబా సంపుటి 4, పుట71, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ 2016)(సీరుస్సహాబ సంపుటి 4, పుట 397–398)(సయ్యదినా అబూబకర్ రజి డాక్టర్ అలీ ముహమ్మద్ సేలాబి ఉర్దూ అనువాదం పుట 339)

తబ్ఖాత్ ఇబ్నే సఅద్ ప్రకారం ఒకసారి బెహ్‌రైన్ జకాత్ సేకరులు హజ్రత్ ఆలా బిన్ హజ్‌రమీ రజిగారిని గూర్చి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధిలో ఫిర్యాదు చేయడం జరిగింది. అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని ఆ పదవి నుండి తొలిగించారు. ఆ తరువాత హజ్రత్ అబ్బాన్ బిన్ సయీద్ బిన్ ఆస్ రజిను పర్యవేక్షకుడిగా నియమించారు. (తబ్ఖాతుల్ ఇబ్నే సఅద్, సంపుటి 4, పుట 266, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 1990) ఆ తరువాత ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పరమపదించిన తరువాత అక్కడ తిరుగుబాటు, ధర్మభ్రష్టత కొనసాగుచున్న సమయంలో హజ్రత్ అబ్బాన్ రజి మదీనాకు తిరిగి వచ్చారు. వీరు పదవిని వీడి వచ్చారు. హజ్రత్ అబూబకర్ రజి వీరిని మరల బెహ్‌రైన్‌కు పంపాలని నిశ్చయించుకోగా అందుకు వీరు రజి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత ఇకపై నేను ఎలాంటి పదవిని చేపట్టును అనే కారణాన్ని చూపి తిరస్కరించారు. అందుకు హజ్రత్ అబూబకర్ రజి మరల హజ్రత్ ఆలా బిన్ హజ్‌రమీ రజిను బెహ్‌రైన్‌కు జకాత్ సేకరులుగా, పర్యవేక్షకులుగా నియమించారు. అలా వారు ఆ పదవిపై తుది శ్వాస వరకు కొనసాగారు.

హజ్రత్ ఆలా రజి దుఆలు స్వీకరించబడుతాయి అనే ప్రాచుర్యంను పొందారు. వారిని గూర్చి అనేక కథనాలు గలవు. హజ్రత్ అబూహురైరహ్ రజి వారి విశిష్టతలను, వారి దుఆల ఆమోదితాలను చూసి ఇలా పేర్కొన్నారు. నేను వారి దుఆల వలన చాలా ప్రభావితుడిని అయ్యాను. కథనములో ఇలా గలదు. వారి అనేక విషయాలను ప్రక్కన పెట్టి చూసినచో ఒక విషయమేమనగా ఒకసారి మదీనా నుండి బెహ్‌రైన్‌కు వెళ్ళుచుండగా మార్గమధ్యలో మంచి నీళ్ళు అయిపోయాయి. వారు అల్లాహ్ తాలాతో దుఆ చేశారు. ఇసుకలో నుండి ఒక చెలిమ బయటికి వచ్చింది. మేమందరం తృప్తిగా దాహం తీర్చుకున్నాము.

మరల హజ్రత్ అబూహురైరహ్ రజి ఇలా తెలిపారు. నేను ఆలా రజి ఇద్దరం బెహ్‌రైన్ నుండి సైన్యంతో కలిసి బస్రా వైపు వెళ్ళుచున్నాము. మేము లయాస్‌లో ఉండగా వారు మృతి చెందారు. లయాస్ బనూ తైమీమ్ ప్రాంతంలోని ఒక గ్రామం పేరు. అక్కడ నీటి చుక్క కూడ కనిపించడం లేదు. అల్లాహ్ తాలా మా కోసం ఒక మబ్బును పంపించాడు. ఆ తరువాత అక్కడ వర్షం పడింది. మేము వారిని స్నానం చేయించాము. మా ఖడ్గాల ద్వారా మేము వారి కొరకు సమాధిని త్రవ్వాము. మేము వారి కోసం లహ్‌ద్ ఏర్పాటు చేయలేదు. ఆ తరువాత తిరిగి వచ్చాము. కొన్ని రోజుల తరువాత మేము అక్కడికి చేరుకొని వారి సమాధిని పటిష్టముగా నిర్మించుదాము అని వెళ్ళాము. కాని అక్కడ వారి సమాధి గుర్తులు మాకు కనిపించలేదు. (తబ్ఖాత్ ఇబ్నే సఅద్ అనువాదం, సంపుటి 4, పుట 375–377, ప్రచురణ నఫీస్ అకాడమీ కరాచి)( అల్ అలాము లిల్ జర్ కలి, సంపుటి 4, పుట 245, ప్రచురణ దారుల్ ఇల్మ్ 2002)

వారి రజి మరణం విషయంలో కూడ భిన్నాభిప్రాయాలు గలవు. కొందరి దృష్టిలో వారు హిజ్రి 14వ సంవత్సరంలో మృతి చెందారని పేర్కొనగా, మరి కొందరు మాత్రం హిజ్రి 21వ సంవత్సరంలో అని పేర్కొన్నారు. (ఉసదుల్ ఘాబా, సంపుటి 4, పుట 71 దారుల్ కుతబుల్ ఇల్మిత్ బెహ్‌రూత్)

బెహ్‌రైన్ పరిస్థితులను గూర్చి ఈ విధముగా గలదు: బెహ్‌రైన్ హీర రాజు ఆధ్వర్యంలో ఉండేది. ఈ హీర అనే రాజు కిస్రా అనే చక్రవర్తికి సామంత రాజుగా పని చేసేవాడు. హీర అనే రాజ్యం ఇస్లాంకు ముందు ఇరాక్ సామ్రాజ్యంలో ఉండేది. బెహ్‌రైన్ మరియు సముద్రపు తీరపు నగరాలలో అన్ని మతాలకు చెందిన ప్రజలు జీవనం కొనసాగించేవారు. ఆ ప్రాంతాలలో ఫారసీలు ఉండేవారు, క్రైస్తవులు ఉండేవారు, యూదులు ఉండేవారు. జాట్‌లు ఉండేవారు. కాని అరబ్‌ల వ్యాపారంపై ఆధిపత్యం మాత్రం ఫారసీయలకు ఉండేది. ఆ ప్రాంతంలో మరొక వ్యాపార బృంధం కూడ వచ్చి ఉన్నది. ఆ బృంధం భారతదేశం మరియు ఈరాన్‌ల నుండి వచ్చినది. వారు ఫరాత్ నది కుడివైపు నుండి అదన్ తీరప్రాంతం వరకు ఉన్నటు వంటి మధ్య భూభాగంలో నివసించేవారు. ఆ వ్యాపారులు ఇక్కడి ప్రాంతీయ వాసులతో వివాహం కూడ చేసుకున్నారు. వారి వలన కల్గిన సంతానాన్ని అబ్‌నాఅ అనే పేరుతో పిలుచుకునే

వారు. (హ్రజత్ అబూబకర్ సిద్ధీఖ్ రజి ముహమ్మద్ హుస్సైన్ హైకల్, ఉర్దూ అనువాదం పుట 237)(ఫ్రాంగ్ సీరత్ పుట 110, జవార్ అకాడమి కరాచి)

సముద్ర తీరపు వెనుకాల మూడు పెద్ద తెగలు మరియు వాటికి చెందిన అనేక చిన్న చిన్న శాఖలు ఉండేవి. వాటిలో ఒకటి బకర్ బిన్ వాహిల్, రెండవది అబ్దుల్ ఖైస్, మూడవది రబీఅ. వీరికి చెందిన అనేక వంశీయులు క్రైస్తవ ధర్మాన్ని అనుసరించువారు. గుర్రాలను, ఒంటెలను, మేకలను పెంచి పోషించడం, ఖర్జూరపు తోటలను కాపాడడం వీరి ప్రధాన వృత్తి. ఈ తెగలకు చెందిన వ్యవహార కర్త ప్రాంతీయ నాయకుడిగా కొనసాగే వాడు. అతనికి హీర రాజు అనుగ్రహాలు అందుతుండేవి. అలాంటి వ్యవహార కర్తలలో ముంజిర్ బిన్ సావా కూడ ఒకరు. వారు బెహ్రైన్‌కు చెందిన హజర్ అనబడే జిల్లాలో ఉండేవారు. హజర్ చుట్టు ప్రక్కల ఉన్నటు వంటి అబ్దుల్ ఖైస్ తెగవారిపై వీరు అధికారం చెలాయించేవారు. (హ్రజత్ అబూబకర్ రజి గారి ప్రభుత్వ లేఖలు, పుట 48, నిద్వతుల్ ముసన్నిఫీన్ దిల్లి).

అబ్దుల్ ఖైస్ తెగకు చెందిన రెండు బృందాలు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి వచ్చాయి. మొదటి బృందం హిజ్రి 5వ సంవత్సరంలో 12 నుండి 14 మంది సభ్యులు ఉన్నటు వంటి ఒక బృందం వచ్చింది. రెండవది ఆముల్ వఫూద్ అనగా హిజ్రి 9వ సంవత్సరంలో వచ్చింది. ఈ బృందంలో జారూద్‌తో కలిపి సుమారు 40 మంది వరకు గల సభ్యులు ఉన్నారు. జారూద్ క్రైస్తవుడే కాని మదీనాకు వచ్చిన తరువాత ముసల్మానుడైనాడు. (అట్లస్ సీరత్ నబ్వీ (స) పుట 438)

హజర్‌కు చెందిన ఫారసీయులు, క్రైస్తవులు, యూదులు ఎంతో అయిష్టంగా జిజియా చెల్లించుటకు అంగీకరించారు. బెహ్రైన్‌కు చెందిన మిగిలిన గ్రామాలు , నగరాలు అన్నియు ముస్లిమేతర ప్రాంతాలుగానే ఉన్నాయి. కాని ఈ ప్రజలకు ఎప్పుడు అవకాశం లభించిన పదే పదే తిరుగుబాటు చేసేవారు. (హ్రజత్ అబూబకర్ రజి గారి ప్రభుత్వ లేఖలు. పుట 48, నద్వతుల్ ముసన్నిఫీయిన్ దిల్లి)( సీరస్సహాబ, సంపుటి 4, పుట 398)

ముంజిర్ బిన్ సావా ఇస్లాంను స్వీకరించినందున రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని గతంలో మాదిరిగానే బెహ్రైన్‌కు అధికారిగానే నియమించారు. అతడు ఇస్లాంను స్వీకరించిన తరువాత తమ జాతి ప్రజలకు కూడ అతడు ఇస్లాం సందేశాన్ని అందజేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో ధార్మిక విద్యను అభ్యసించడం కోసం జారూ బిన్ ముఅల్లాను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి పంపించాడు. జారూ మదీనా చేరుకొని ఇస్లామీయ బోధనలను, ఆదేశాలను నేర్చుకున్నాడు. ఆ తరువాత అతడు తన జాతి వైపు తిరిగి వెళ్ళి అక్కడి ప్రజలకు ప్రచారం చేయడం, ఇస్లామీయ బోధనలను గూర్చి అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టాడు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హిజ్రి 11వ సంవత్సరంలో మృతి చెందారు. ఆ తరువాత కొన్ని రోజులకే ముంజిర్‌కూడ మృతి చెందాడు. ఈ సమయంలో అరబ్ మరియు అరబ్బేతరులు నలువైపుల నుండి తిరుగుబాటు చేయడం ప్రారంభించారు. అబ్దుల్ ఖైస్ తెగవారు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒకవేళ ప్రవక్తయే అయినచో వారికి మరణమే రాకుండేది అని కారణాన్ని చూపి ధర్మభ్రష్టత్వంను అవలంభించారు. ఈ విషయం హ్రజత్ జారూ రజికు తెలిసింది. హ్రజత్ జారూ రజి తమ జాతి ప్రజలలోనే ఉన్నతమైన కుటుంబానికి చెందినవారు. పైగా ఇస్లామీయ బోధనలను నేర్చుకొనుటకు మదీనాకు కూడ వెళ్ళారు. అనగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వైపు ప్రస్థానం చేసినవారిలో ఒకరు. అన్నింటిని మించి వారు ఒక మంచి ప్రసంగీకులు. (అల్ బిదాయతు వన్నిహాయతు సంపుటి 9, పుట 475-476, ప్రచురణ దారుల్ హిజర్)

హ్రజత్ జారూ రజి ఆ హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎందుకు మృతి చెందారు? అనే విషయాన్ని తెలియపర్చడం కోసం ధర్మభ్రష్టతను అవలంభించిన వారందరిని ఒక చోట ఏకం చేసి ఈ విధముగా ప్రసంగించ సాగాడు. ఓ అబ్దుల్ ఖైస్ తెగవారలారా! మిమ్ములను ఒక విషయం అడుగుతాను. ఒకవేళ మీకు ఆ విషయంను గూర్చి తెలిసినచో నాకు చెప్పండి. ఒకవేళ మీకు తెలియకపోతే నాకు చెప్పకండి అని అన్నాడు. అందుకు వారు నీవు అడుగదలుచుకున్నది అడుగుము అని అన్నారు. హ్రజత్ జారూ రజి వారిని ఇలా అడిగారు. పూర్వం దేవుని ప్రవక్తలు ఈ ప్రపంచంలో అవతరించారా? అని అడిగారు. అందుకు వారు అవును అవతరించారు అని సమాధానం ఇచ్చారు. అందుకు హ్రజత్ జారూ రజి మరల వారితో మీకు ఈ విషయాన్ని ఎవరైన చెప్పారా? లేదా మీరే స్వయముగా వారిని చూశారా? అని అడిగారు. అందుకు వారు మేము వారిని చూడలేదు కాని వారిని గూర్చి విన్నాము తెలుసుకున్నాము అని సమాధానం ఇచ్చారు. అందుకు మరల హ్రజత్ జారూ రజి మరి వారికి ఏమైంది? అని అడిగారు. అప్పుడు వారు వారందరు చనిపోయారు అని సమాధానం ఇచ్చారు. అప్పుడు హ్రజత్ జారూ రజి గత పూర్వపు ప్రవక్తలు మృతి చెందిన విధముగానే ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడ మృతి చెందారు. ఈ సందర్భముగా నేను లా ఇలాహా ఇల్లల్లాహు వ అన్న ముహమ్మదన్ అబ్దుహు వ రసూలుహూ అనగా అల్లాహ్ తప్ప మరెవరు ఆరాధనకు అర్హులు కారు, నిశ్చయముగా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అతని దాసుడు మరియు ప్రవక్త అని ప్రకటిస్తున్నాను అని అన్నారు.

వారి జాతి ప్రజలు వారి ఈ ఉపన్యాసాన్ని విన్న తరువాత, కొన్ని ప్రశ్నలు అడిగి సమాధానాలు విన్న తరువాత వారు కూడ అల్లాహ్ తప్ప మరెవరు ఆరాధనకు అర్హులు కారు, నిశ్చయముగా ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అతని దాసుడు మరియు ప్రవక్త అని తాము కూడ ప్రకటిస్తున్నాము అని అన్నారు. ఆపై వారు హ్రజత్ జారూ రజితో నిన్ను మా నాయకుడిగా, మా ఉత్తమ పురుషుడిగా అంగీకరిస్తున్నాము అని కూడ ప్రకటించారు. ఈ విధముగా వారి జాతి ప్రజలు ఇస్లాంపై పటిష్టముగా ఉండిపోయారు. ధర్మభ్రష్టత్వపు ప్రభావం వారి దరికి చేరలేదు.

(తారీఖే తిబ్రి, సంపుటి 2, పుట 285, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ లిబ్నాన్ 2012)

మిగిలిన అరబ్‌లు మరియు అరబ్బేతరులు మదీనాలో ఉన్న ఇస్లామీయ ప్రభుత్వాన్ని కూల్చడానికి చాలా రకాలుగా ప్రయత్నించారు. ఈరాన్ ప్రభుత్వం అలాంటి వారికి వెన్నుదన్నుగా నిలిచింది. తిరుగుబాటు చర్యల ఆధిపత్యంను అరబ్‌కు చెందిన ఒక నాయకుడికి అప్పగించింది. హజర్‌లో ఉన్నటు వంటి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ప్రతినిధి అబ్బాన్ బిన్ సయీద్ బిన్ ఆస్ తిరుగుబాటును చూసి మదీనాకు తిరిగి వచ్చారు. (హ్రజత్ అబూబకర్ రజి ప్రభుత్వ లేఖలు, పుట49, నద్వతుల్ ముసన్నిఫీన్ దిల్లి)

అబ్దుల్ ఖైస్ తెగకు చెందిన వారిలో కొందరు ఇస్లాంపైనే నిలకడగా ఉన్నప్పటికి బహ్రైన్ మరియు ఇతర తెగలు హుతమ్ బిన్ జుబైఅ ఆధ్వర్యంలో ఉన్నటు వంటి తెగల వారు మాత్రం ధర్మభ్రష్టత్వంను అవలంభించారు. వారు మరల రాజరికానికి పునాధులు వేసుకొని ముంజిర్ వంశీయులలోని ముంజిర్ బిన్ నుఅమాన్‌ను తమ రాజుగా ఎన్నుకున్నారు. మరొక కథనములో ఈ విధముగా గలదు.

వారు ముంజిర్ బిన్ నుఅమాన్‌ను తమ రాజుగా ఎన్నుకోవాలని నిర్ణయించుకున్న తరువాత ఆ తెగకు చెందిన కొందరు ప్రముఖులు, నాయకులు ఒక బృందముగా ఏర్పడి ఈరాన్ చక్రవర్తి కిస్రా వద్దకు చేరుకున్నారు. వారు స్వయముగా చక్రవర్తితో మాట్లాడదానికి అనుమతిని కోరారు. అందుకు వారికి అనుమతి కూడ లభించింది. వారు చక్రవర్తి వైభవాన్ని కొనియాడుతూ చక్రవర్తి ముందు నిలబడ్డారు. వారిని ఉద్దేశించి కిస్రా ఇలా అన్నాడు! ఓ అరబ్ తెగల వారా! ఏ ఉద్దేశంతో మీరు ఇక్కడి వచ్చారు? అని అడిగాడు. అందుకు వారు ఓ చక్రవర్తి! ఖురైష్‌లు మరియు ముజ్‌ర్‌కు చెందిన కొన్ని తెగల వారు గొప్పవారిగా భావించుకునే అరబ్‌కు చెందిన ఒక వ్యక్తి మృతి చెందారు. అనగా వారి దృష్టిలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం. వారు మరల ఇలా అన్నారు. వారి తరువాత వారి ఉత్తరాధికారిగా ఒక బక్కపల్చటి, బలహీన వ్యక్తి ఎన్నుకోబడ్డారు. వారు హ్రజత్ అబూబకర్ రజిను గూర్చి ఈ విధముగా చెప్పారు. వారి జకాత్ సేకరులు, పర్యవేక్షకులు వారి నుండి మార్గదర్శకాలు పొందడానికి వారి వద్దకు వెళ్ళారు. నేడు బెహ్రైన్ ప్రాంతం వారి చేతిలో నుండి జారిపోయింది. అబ్దుల్ ఖైస్‌కు చెందిన ఒక చిన్న తెగవారు తప్ప మిగిలిన వారందరు వారి ఇస్లాం ధర్మంను వదిలి పెట్టారు. మా దృష్టిలో వారికంటూ ఎలాంటి ప్రాధాన్యత లేదు. వారి సైన్యం కంటే మా సైన్యం గుర్రాల పరంగా, సైనిక పరంగా ఎక్కువగానే ఉన్నది. ఎవరైన బెహ్రైన్‌ను మరల ఆధీనపర్చుకోవడానికి ప్రయత్నించినా కూడ ఆధీనం కాకుండా అడ్డుకోవడానికి మీరు మా వైపు ఒక వ్యక్తిని పంపించండి అని విన్నవించుకున్నారు. అందుకు కిస్రా వారితో ఇలా అన్నాడు. బెహ్రైన్‌ను పంపించడానికి

మీరు ఎవరిని ఇష్టపడుతున్నారు? అని అడిగాడు. అప్పుడు వారు చక్రవర్తి ఎవరిని అర్హులుగా భావించునో వారినే పంపించండి అని అన్నారు. అందుకు కిస్రా వారితో మీరు ముంజిర్‌బిన్ నుమాఅన్‌బిన్ ముంజిర్‌ను గూర్చి ఎలాంటి అభిప్రాయాన్ని కల్గియున్నారు? అని అడిగాడు. అందుకు వారు ఓ చక్రవర్తి! మాకు కూడ అతడంటే ఇష్టమే. అతడు కాకుండా మేము మరొకరిని కోరుకోవడం లేదు అని అన్నారు. అప్పుడు కిస్రా ముంజిర్ బిన్ నుఉమాన్‌ను పిలిపించాడు. అతడు ఇప్పుడిప్పుడే యవ్వనంలోకి వెళ్ళుతున్నాడు. క్రొత్త క్రొత్తగా గడ్డం వస్తుంది. చక్రవర్తి అతనికి వైజ్ర వైఢుర్యాలను అందించి తలపై కిరీటాన్ని ధరింపజేశాడు. వంద గుఱ్రపు సైనికులను, 7000ల సాధారణ సైనికులను తోడుగా పంపాడు. ఆపై అతనిని బకర్ బిన్ అవాయిల్‌తో కలిసి బెహ్రైన్ వెళ్ళమని ఆదేశించాడు. అతనికి తోడుగా ఖైస్ బిన్ సఅలబ తెగకు చెందిన అబూ జుబైఅ హుతమ్ బిన్ జైద్, ఇతని పేరు షురహ్ బిన్ జుబైఅ కాని హుతమ్ అని భిరుదు. ఇతడు ఇస్లాంను స్వీకరించిన తరువాత ధర్మభ్రష్టతను అవలంభించాడు. జబ్యాన్ బిన్ అమర్ మరియు ముస్మిముఊ బిన్ మాలిక్ కూడ ఉన్నారు. (కితాబు ర్రద్దతు లిల్ వఖ్దీ, పుట 147-149, దారుల్ ఘర్బిల్ ఇస్లాం 1990)

అందరి కంటే ముందుగా వారు జారూ రజి మరియు అబ్దుల్ ఖైస్ తెగవారిని ఇస్లాం నుండి దూరం చేయాలని ప్రయత్నించారు. కాని విఫలం చెందారు. ఆ తరువాత హుతమ్‌బిన్ జుబైఅ బలంతో వారిని తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని ప్రయత్నించాడు. ఈ క్రమంలో వారు ఖతీఫ్ మరియు హజర్‌లో ఉంటున్న అన్య దేశస్తుల వ్యాపారులను, గతంలో ఇస్లాంను స్వీకరించని ప్రజలను తమతో కలుపుకున్నాడు. (హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ రజి ముహమ్మద్ హుస్సైన్ హైకల్, పుట 238-239, ఇస్లామీ కుతుబ్ ఖానా లాహోర్)

అబ్దుల్ ఖైస్ తెగకు చెందిన ప్రజలు తమ నాయకుడు హజ్రత్ జారూ బిన్ ముఅల్లాహ్ రజి వద్ద తమ మిత్ర పక్షం మరియు బానిసలతో కలిసి 4000ల సంఖ్యలో ఏకమయ్యారు. బికర్ బిన్ అవాయిల్ తన 9వేల ఈరానీ సైనికులతో మరియు 3000ల అరబ్ సైనికులతో కలిసి ఏకమయ్యారు.

ఆ తరువాత ఇరుపక్షాల వారి మధ్య భీకర యుద్ధం జరిగింది. బికర్ బిన్ అవాయిల్‌కు ఈ యుద్ధం వలన చాలా నష్టం వాటిల్లింది. ఈరానీయులు మరియు అరబ్‌కు చెందిన సైనికులలో అధిక మంది హత్య చేయబడ్డారు. ఆ తరువాత వారు రెండవ సారి కూడ భీకర యుద్ధం చేశారు. ఈ సారి అబ్దుల్ ఖైస్ తెగవారికి నష్టం కల్గింది. ఈ విధముగా వారు పరస్పరం ప్రతీకారం తీర్చుకునే పనిలోనే ఉన్నారు. వారి మధ్యలో చాలా రోజుల వరకు యుద్ధం జరిగింది. ఈ క్రమంలో చాలా మంది హత్య చేయబడ్డారు. చివరికి అబ్దుల్ ఖైస్ తెగవారు బికర్ బిన్ అవాయిల్‌తో ఒప్పందం కుదుర్చుకొనుటకు అపీలు చేసింది. ఆ సమయంలో బికర్ బిన్ అవాయిల్‌తో పోరాడుటకు తమకు బలం లేదని అబ్దుల్ ఖైస్ వారు అర్థం చేసుకున్నారు. ఈ విధముగా వారు ఓటమిపాలై హజర్ ప్రాంతంలోని జువాసామి కోటలో వారు తల దాచుకున్నారు. జువాసా కూడ బెహ్రైన్‌కు చెందిన ఒక నగరం. ఇక్కడే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి మస్జిదేనబ్వీ తరువాత ఇక్కడే మొదటి సారిగా జుమా నమాజ్ చదువించడం జరిగింది. ఈ క్రమంలోనే బుఖారి లో ఒక కథనము ఈ విధముగా గలదు. ఈ కథనాన్ని హజ్రత్ ఇబ్నే అబ్బాస్ రజి ఉల్లేఖించారు. ఈ కథనము ఇలా గలదు. ఇన్న అవ్వల జుముఅతిన్ ముమ్మిఅత్ బఅద జుముఅతిన్‌హ ఫి మస్‌జిది రసూలిల్లాహి ఫి మస్‌జిది అబ్దిల్ ఖైసి బిజువాసా మినల్ బహ్రైన్ అనగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మస్జిద్ తరువాత అబ్దుల్ ఖైస్ తెగకు చెందిన మస్జిద్‌లోనే మొదటి సారిగా జుమా నమాజ్ చదవడం జరిగింది. ఈ మస్జిద్ జువాసాలో ఉన్నది.

బనూ బికర్ బిన్ వాయిల్ తన ఈరాని ప్రజలతో కలిసి ముందుకు కదిలింది. వారి కోటల వరకు చేరుకున్నది. వారిని ముట్టడించింది. వారి అన్నపానీయాలను అడ్డుకున్నది. బనూ బికర్ బిన్ కిలాబ్ కు చెందిన ఒక వ్యక్తి అబ్దుల్లాహ్ బిన్ ఔఫ్ అబ్ది అతని అసలు పేరు అబ్దుల్లాహ్ బిన్ హజఫ్ వారు ఈ సందర్భమును గూర్చి హజ్రత్ అబూబకర్ రజి మరియు మదీనా వాసులను ఉద్దేశించి కొన్ని పంక్తులను వ్రాసాడు. వాటిలో అతడు తన నిస్సహాయతను, నిరాధారతను, సహనాన్ని, ఓర్పును గూర్చి వివరించాడు.

أَلَا أَبْلِغْ أَبَابَكْرٍ رَسُوْلًا
وَفِتْيَانَ الْمَدِيْنَةِ أَجْمَعِيْنَا
[فَهَلْ لِيْ فِيْ شَبَابٍ مِنْكَ أَمْسَوْا
جِيَاعًا فِيْ جَوَاثِيْ مُحْصَرِيْنَا
كَأَنَّ دِمَاءَهُمْ فِيْ كُلِّ فَجٍّ
شُعَاعُ الشَّمْسِ يَغْشَى النَّاظِرِيْنَا
تُحَاصِرُهُم بَنُوْ ذُهْلٍ وَ عِجْلٍ
وَ شَيْبَانَ وَ قَيْسٍ ظَالِمِيْنَا
يَقُوْدُهُمُ الْغُرُوْرُ بِغَيْرِ حَقٍّ
لِيَسْتَلِبَ الْعَقَائِلَ وَالْبَنِيْنَا
فَلَمَّا اشْتَدَّ حَصْرُهُمُ وَ طَالَتْ
أَكُفُّهُمُ بِمَا فِيْهِ بُلِيْنَا
تَوَكَّلْنَا عَلَى الرَّحْمٰنِ إِنَّا
وَجَدْنَا الْفَضْلَ لِلْمُتَوَكِّلِيْنَا
وَقُلْنَا قَدْ رَضِيْنَا اللهَ رَبًّا
وَ بِالْإِسْلَامِ دِيْنًا قَدْ رَضِيْنَا
وَقُلْنَا وَالْأُمُوْرُ لَهَا قَرَارٌ
وَ قَدْ سَفِهَتْ حُلُوْمُ بَنِيْ أَبِيْنَا
نُقَاتِلُكُمْ عَلَى الْإِسْلَامِ حَتّٰى
تَكُوْنُوْا أَوْ نَكُوْنَ الذَّاهِبِيْنَا
بِكُلِّ مُهَنَّدٍ عَضْبٍ حُسَامٍ
يَقُدُّ الْبِيْضَ وَالزُّرْدَ الدَّفِيْنَا]

ఇది కొంచం పెద్ద పద్యం. మొత్తానికి దీని అర్థమేమనగా, ఓ ఆలకించు వారలారా! అబూబకర్ రజి మరియు మదీనాకు చెందిన యువకులందరికి మా ఈ విన్నపాన్ని అందజేయండి. జవాసాలో ముట్టడి వలన ఆకలి దప్పికలతో అల్లాడిపోతున్న వారికోసం మీ నుండి మాకు ఏమైన సహాయం అందగలదా? అన్ని మార్గాలలో ఇక్కడి నవయువకుల రక్తం చిందించబడింది. చూపరులకు సూర్యుడి కిరణాల వలే కనిపిస్తుంది. బనూ జుహల్, ఇజిల్ మరియు షైబాన్ మరియు ఖైస్ తెగల వారు దౌర్జన్యం చేస్తూ అందరిని ముట్టడి చేశారు. వారి నాయకుడు వీర్రవీగుతున్నాడు. (ఘురూర్ అసలు పేరు ముంజిర్ బిన్ నుఉ మాన్ బిన్ ముంజిర్) అన్యాయముగా అతడు మా భార్యలను, పిల్లలను లాక్కెల్లాడు. వారు కఠినముగా ముట్టడించడం వలన వారు మాపై ఆధికృతను సాధించారు. ఫలితముగా మేము సతమతమవుచున్నాము. మేము దయామయుడైన అల్లాహ్‌పై నమ్మకాన్ని పెంచుకున్నాము. ఎందుకనగా అతనిని నమ్ముకున్న వాళ్ళకు అతని అనుగ్రహం లభించడాన్ని మేము చూశాము. కావున అల్లాహ్‌యే మా సంరక్షకుడు, ఇస్లాం ధర్మమే మా ధర్మం అనే అంశాలపైనే మేము సంతృప్తిగా ఉన్నాము. సమస్యలు సద్దుమణుగుతాయి. మా తాత ముత్తాతల సంతానం మూర్ఖులైనారు. మేము ఇస్లాంపై స్థిరముగా ఉంటూనే మేము మీతో యుద్ధం చేస్తాము. ఈ యుద్ధంలో మీరైన చావాలి. మేమైన చావాలి. మాలో ప్రతి ఒక్కరు పదునైన ఖడ్గంతో యుద్ధం చేస్తాము. అది వేగంగా కవచాలను, ఖడ్గాలను నరుకుతుంది.

ఈ విన్నపాన్ని పద్యంలో రూపంలో అబ్దీ పంపించాడు.

హజ్రత్ అబూబకర్ రజి ఈ పద్యాన్ని చదివి అబ్దుల్ ఖైస్ వారి స్థితిని తెలుసుకొని చాలా బాధపడ్డారు. వారు రజి వెంటనే హజ్రత్ అలా బిన్ హజ్‌రమి రజిను పిలిపించి వారికి ముహాజిర్ మరియు అన్సార్‌లు గల 2000ల మందితో కూడిన ఒక సైన్యాన్ని అప్పగించి వెంటనే బెహ్రైన్‌లో ఉన్నటు వంటి అబ్దుల్ ఖైస్‌కు సహాయం అందించమని వారిని అక్కడి నుండి సాగనంపారు. ఆపై మరల వారికి మార్గ మధ్యలో ఎదురయ్యే అరబ్ తెగలకు చెందిన యువకులను కూడ తమ వెంట తీసుకొని వెళ్ళమని, వారిలో బనూ బికర్‌కు వ్యతిరేకముగా యుద్ధం చేయాలనే ఉత్సాహానంను నింపమని కూడ అనుమతినిచ్చారు. ఎందుకనగా వారు ఈరాన్ చక్రవర్తి ప్రతినిధి ముంజిర్ బిన్ నుఉమాన్ బిన్ ముంజిర్‌తో కలిసిపోయారు. అతడు అనగా ఆ చక్రవర్తి అతని తలపై కిరిటాన్ని ధరింపజేశాడు. అల్లాహ్ తేజస్సును ఆర్పాలని చూస్తున్నాడు. దైవజనులను హత్యచేశాడు. కావున మీరు లా హౌలా వలా ఖువ్వత ఇల్లా బిల్లాహి అనగా పాపాల నుండి కాపాడుకునే శక్తి లేదు, సత్కార్యములు చేయు సామర్థ్యం లేదు. కాని అల్లాహ్ అనుగ్రహం వలనే ఇవి సాధ్యం అని చదువుకుంటూ వెళ్ళండి అని కూడ చెప్పారు. (సేకరణ కితాబుర్రిదత్ లిల్ వఖ్దీ, పుట 152-154, దారుల్ ఘర్బ్‌ల్ ఇస్లామీ 1990)(సహి బుఖారి, కితాబుల్ జుమా బాబ్ జుమఅ ఫిల్ ఖురఅ వల్ మదన్, హదీస్ 892)(తారీఖ్ తిబ్రి, సంపుటి 2, పుట 286, (దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్)

హజ్రత్ ఆలా బిన్ హజ్‌రమి రజి బయలు దేరినారు. వారు యమామకు సమీపంనకు చేరుకోగా హజ్రత్ ఉమామ బిన్ ఉసాల్ బనూ హనీఫా తెగకు చెందిన ఒక సైన్యం వారిలో కలిసిపోయింది. హజ్రత్ ఉసాల్ కూడ వారితో కలిసిపోయారు. వారే గాకుండా ఖైస్ బిన్ ఆసిమ్ కూడ తన బనూ తైమీమ్ తెగవారితో కలిసి హజ్రత్ ఆలా బిన్ హజ్‌రమి రజి సైన్యంలో కలిసిపోయారు. అంతకు ముందు ఖైస్ బిన్ ఆసిం జకాత్‌ను తిరస్కరించు వారిలో చేరిపోయాడు. అతడు తన తెగవారి జకాత్‌ను మదీనాకు పంపకుండా అడ్డుకున్నాడు. జమా చేసిన జకాత్ నగదును తిరిగి తమ జాతి ప్రజలలో పంచి పెట్టాడు. కాని హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ రజి యమామలో బనూ హనీఫా వారిని మరల ఓడించినప్పుడు ఈ ఖైస్ బిన్ ఆసిం మరల ఇస్లాంను స్వీకరించడంలోనే తన శ్రేయస్సు ఉన్నదని భావించాడు. అందుకే తన తెగవారైన బనూ తైమీమ్ వారి నుండి మరల జకాత్‌ను సేకరించి మదీనాకు చెల్లించాడు. మొత్తానికి అతడు అలా హజ్రత్ ఆలా బిన్ హజ్‌రమి రజి సైన్యంలో చేరిపోయాడు.

(హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ రజి రచయిత ముహమ్మద్ హుస్సైన్ హైకల్ పుట 239, ఇస్లామీ కుతుబ్ ఖాన లాహెూర్)

హజ్రత్ ఆలా రజి సైన్యం దహ్నా మార్గం గుండా బెహ్రైన్‌కు చేరుకున్నది. ఆలా రజి తన సైన్యాన్ని దహ్నా మార్గం ద్వారా బెహ్రైన్‌కు తీసుకవెళ్ళారు. దహ్నా అనేది తైమీమ్ తెగవారు నివాసం ఉంటున్న మక్కా మరియు బస్రా నగరాల మధ్యలో ఉన్నటు వంటి ఒక ప్రాంతం. వారు ఇలా తెలిపారు. మేము ఆ ప్రాంత మధ్యకు చేరుకోని అక్కడే బస చేశాము. కథకుడు ఇలా తెలిపాడు. రాత్రి వేళ ఒంటెలు అదుపు తప్పి ఒక్కసారిగా పరుగులు తీశాయి. ఫలితముగా ఎవరి వద్ద కూడ ఒంటెలు లేవు, ఒంటెలపై ఉన్న ఆహార సామాగ్రి లేదు, గుడారాలు లేవు. అవన్నియు ఆ ఎడారిలో పారిపోయాయి. అనగా ఒంటెలపై తీసుకవస్తున్న సామాగ్రి కూడ లేకుండా పోయింది. ఒంటెలు పారిపోవడం వలన ఏమి లేకుండా పోయింది. ఈ ఘటన ఎప్పుడు జరిగిందనగా ప్రజలు ఒంటెలపై నుండి క్రిందికి దిగిన తరువాత ఇంకా సామాగ్రిని క్రిందికి దింపక ముందే జరిగింది. ఈ ఘటన వలన అందరు బాధలో మునిగిపోయారు. అందరు తమ జీవితాల పట్ల నిరాశకు గురై ఒకరు మరొకరికి వసియ్యత్ చేసుకోసాగారు. ఇంతలోనే హజ్రత్ ఆలా రజి అందరిని ఒక చోట ఏకం కమ్మని పిలుపునిచ్చారు. అందరు ఒకచోట ఏకమైయ్యారు.

| అహ్‌దీస్ బోధనలు | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
|---|---|

దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, Ameer Zila warangal, (Telangana)*

హజ్రత్ ఆలా రజి వారితో ఇలా అన్నారు. మీలో ఏదో తెలియని భయాందోళనలు కనిపిస్తున్నాయి? మీరందరు ఎందుకు ఇలా చింతిస్తున్నారు? అని అడిగారు. అందుకు వారు మేము ఇందుకు బాధ్యులము కాము. మా ఒంటెలు పారిపోయాయి. మా పరిస్థితి ఈ విధముగా ఉన్నది. ఉదయం వరకు ఈ స్థితిలోనే ఉన్నచో సూర్యోధయానికి ముందే మేమందరం మరణించి పోతాము అని విన్నవించుకున్నారు. హజ్రత్ ఆలా రజి ఇలా అన్నారు. ఓ ప్రజలారా! భయపడకండి! మీరు ముసల్మానులు కారా?. మీరు అల్లాహ్ మార్గంలో జిహాద్ చేయుటకు బయలు దేరలేదా?. మీరు అల్లాహ్‌కు సహాయం చేయువారు కాదా? అని అడిగారు. అందుకు వారు నిశ్చయముగా మేము వారమే అని అన్నారు. హజ్రత్ ఆలా రజి ఇలా అన్నారు. అలా అయినచో మీకు శుభవార్తనిస్తున్నాను. మీరు ఉన్న ఈ పరిస్థితిలో అల్లాహ్ ఎన్నడు మిమ్ములను ఒంటరి వాడిని చేయడు అని ధైర్యానిచ్చాడు.

ఉషోదయం కంటే ముందే ఫజర్ నమాజ్ కొరకు అజాన్ ఇవ్వడం జరిగింది. హజ్రత్ ఆలా రజి నమాజ్‌ను చదువించారు. నీళ్ళ సౌకర్యం లేనందున కొందరు తైమీమ్ చేసుకొని నమాజ్‌ను చదివారు. కొంతమందికి గతంలో చేసుకున్న వజూ ఉండెను. నమాజ్ పూర్తికాగానే హజ్రత్ ఆలా రజి దుఆ కొరకు మోకాళ్ళపై కూర్చున్నారు. వారిని చూసి మిగిలిన వారందరు కూడ దుఆ కోసం మోకాళ్ళపై కూర్చున్నారు. ఆపై ఎంతో దీనంగా రెండు చేతులను పైకి ఎత్తి దుఆలు చేశారు. ప్రజలు సూర్యోధయం వరకు అలాగే దుఆలు చేస్తూ ఉండిపోయారు. తూర్పు దిక్కు నుండి సూర్యుని కాంతి కిరణాలు నేలపై పడుచున్నాయి. అవి నీటి చెలిమ వలే కనిపించసాగింది. హజ్రత్ ఆలా రజి వెనుక ఉన్నవారి వైపు చూశారు. ఈ చెలిమ వెలుగు ఎక్కడి నుండి వస్తుందో తెలుసుకొని రమ్మని ఒకరిని పంపారు. ఒకవ్యక్తి తెలుసుకోవడం కోసం వెళ్ళాడు. అతడు తిరిగి వచ్చి ఇది కేవలం సూర్యుని కిరణాల వెలుగు మాత్రమే. ఈ కిరణాలు నేలపై పడి మెరుస్తుండడం వలన నీటి చెలిమ వలె కనిపిస్తుంది కాని అక్కడ ఎక్కడ కూడ నీటి చెలిమ లేదు అని సమాధానం ఇచ్చాడు. హజ్రద్ ఆలా రజి మరల దుఆలో మునిగిపోయారు. రెండవ సారి కూడ అలాగే కనిపించింది. కావున మరల తెలుసుకొని రమ్మని పంపారు. మరల మూడవ సారి కూడ అలాగే కనిపించింది. కావున మరల తెలుసుకొని రమ్మని పంపారు. ఈ సారి అక్కడి నీటి చెలిమ ఉన్నదని ఆ వ్యక్తి వచ్చి సమాధానం ఇచ్చాడు. ఆ సమాధానం విని హజ్రత్ ఆలా రజి నిలబడ్డారు. వారిని చూసి మిగిలిన ప్రజలు నిలబడ్డారు. అందరు ఆ నీటి వద్దకు చేరుకొని మంచినీళ్ళు త్రాగారు. ఆ తరువాత స్నానాలు చేశారు. అక్కడ ఒక చెలిమ వెలిసింది. పూర్తిగా ఉదయం కాకముందే నలువైపుల నుండి వారి ఒంటెలు వారి వద్దకు పరుగెత్తుకుంటూ వచ్చాయి. అలా వచ్చి అవి వారి వద్ద కూర్చున్నాయి. ప్రతి ఒక్కరు తమ ఒంటెను పట్టుకున్నాడు. వారి వారి సామాగ్రిని చూసుకోగా, సామాగ్రి అంతయు సురక్షితముగానే ఉన్నది.

దుఆల మహత్యం వలన అక్కడ అల్లాహ్ తాలా మంచి నీటి చెలిమను పుట్టించాడు. వారి ఒంటెలు వారి వద్దకు తిరిగి వచ్చునట్లు చేశాడు. ప్రజలు వాటికి కూడ నీళ్ళను త్రాపించారు. మరోసారి అందరు దాహం తీర్చుకున్నారు. మరోఆరి జంతువులకు నీళ్ళను త్రాపించారు. తమ వెంట కూడ మంచినీటిని తీసుకొని బయలుదేరినారు. ఇప్పుడు వారు చాలా సౌకర్యముగా ఉన్నారు.

మిన్‌జాబ్ బిన్ రషీద్ ఇలా తెలిపారు. ఆ సమయంలో హజ్రత్ అబూబకర్ రజి నాతో ఉన్నారు. మేము ఆ ప్రాంతం నుండి కొంచం ముందుకు వెళ్ళిన తరువాత వారు నాతో ఆ మంచి నీటి చెలిమ ఉన్న చోటు నీకు తెలుసా? అని అడిగారు. అందుకు నేను ఇతర అరబ్ తెగల కంటే నాకు ఈ ప్రాంతంలోని అణువణువును గూర్చి బాగా తెలుసు అని సమాధానం ఇచ్చాను. అప్పుడు వారు అలాగైనచో నాకు ఆ ప్రాంతాన్ని చూపించుము అని హజ్రత్ అబూబకర్ రజి అన్నారు. అందుకు మేము మా ఒంటెలను వెనుకకు త్రిప్పి

| అహ్‌దీస్ బోధనలు | **"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్ఖియామ్, ఫసలుస్సాలిస్) |
|---|---|

దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb Babu, Ameer Zila Mahboobnagar, (Telangana)*

సరిగ్గా ఆ నీటి చెలిమ ఉన్నటు వంటి ప్రాంతానికి తీసుకవెళ్ళాను. అక్కడ చూడగా అక్కడ నీళ్ళ తొట్టెగాని, నీళ్ళ ఆనవాళ్ళుగాని ఏమి కనిపించలేదు. అప్పుడు నేను హజ్రత్ అబూహురైరహ్ రజితో ఇలా అన్నాను. దేవుని ప్రమాణం! ఇక్కడ నీటి తొట్టి ఇప్పుడు నాకు కనిపించకున్నా కూడ ఆ చెలిమ ఇక్కడి నుండి వెలువడినట్లు, ఇక్కడే మేము మంచినీళ్ళు త్రాగినామని ఖచ్చితముగా తెల్పుచున్నాను. ఇప్పటి వరకు మేము అంత తియ్యని, శుభ్రమైన మంచినీటిని ఎన్నడు త్రాగలేదు. చూడలేదు. నిజానికి ఆ సమయంలో గిన్నేలలో మేము మంచి నీటి పట్టుకున్నాము అని అన్నారు. అందుకు హజ్రత్ అబూహురైరహ్ రజి ఇలా అన్నారు. ఓ అబూ సహమ్! దేవుని ప్రమాణం! ఖచ్చితముగా ఇది ఆ ప్రాంతమే. అందుకే నేను ఇక్కడికి వచ్చాను, నిన్ను కూడ తీసుకవచ్చాను. నేను ఇక్కడే నా గిన్నలో మంచినీటిని నింపుకున్నాను. నేను దానిని ఆ మంచినీటి తొట్టె అంచున పెట్టాను. మరల నేను ఇలా అన్నాను. ఒకవేళ ఇది అల్లాహ్ యొక్క మహత్యమైనచో అల్లాహ్ తాలా వైపు నుండి అనుగ్రహించబడిన అనుగ్రహమైనచో నేను దానిని గూర్చి తెలుసుకుంటాను. ఒకవేళ అది కేవలం వర్షపు నీరు అయినా కూడ నేను దానిని గూర్చి తెలుసుకుంటాను. పరిశీలించి చూడగా అది అల్లాహ్ తాలా యొక్క మహత్యమే కాని వర్షపు నీరు కాదని, మమ్ములను కాపాడడం కోసం అల్లాహ్ తాలా ఆ చెలిమను పుట్టించాడని అర్థమైనది. అందుకు హజ్రత్ అబూహురైరహ్ రజి దేవున్ని స్మరించుకున్నాడు. అక్కడి నుండి తిరిగి మేము మరల మా మార్గం ద్వారా ప్రయాణించి హజర్‌కు చేరుకొని బస చేశాము. (తారీఖే తిబ్రి, సంపుటి 2, పుట 286–288, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ లిబ్నాన్ 2012)(ప్రాంగ్ సీరత్ పుట 123, జవాహిర్ అకాడమి కరాచి)

హజ్రత్ ఆలా రజి హజ్రత్ అబూబకర్ రజికు ఒక లేఖ వ్రాసారు: అందులో ఇలా గలదు. అమ్మా బాఅద్ అల్లాహ్ తాలా మా కోసం దహ్నా ప్రాంతంలో మంచి నీటి చెలిమను పుట్టించాడు. ఈ ఘటన తరువాత హజ్రత్ అబూబకర్ రజికు ఆ వార్త తెలిసినప్పుడు వారు కూడ ఒక లేఖ వ్రాసారు. నిజానికి అక్కడ నీటి చెలిమకు చెందిన ఎలాంటి ఆనవాళ్ళు లేకుండెను. చాలా బాధలు , ఇబ్బందులు పడిన తరువాత అల్లాహ్ తాలా మాకు తన ఒక మహత్యమును చూపించాడు. హజ్రత్ ఆలా రజి హజ్రత్ అబూబకర్ రజికు లేఖ వ్రాసారు. బాధలు, సమస్యల తరువాత అల్లాహ్ తాలా మాకు ఒక మహత్యమును చూపించాడు. మా అందరి కోసం అదొక గుణపాఠం. ఇందుకోసం మేము అల్లాహ్ తాలాకు కృతజ్ఞతలు తెల్పుచున్నాము. కావున అల్లాహ్ సన్నిధిలో మా కోసం దుఆలు చేయండి. అతని ధర్మ రక్షణ కోసం సహాయాన్ని యాచించండి అని కోరారు. హజ్రత్ ఆలా రజి మంచి నీరు లభించిన తరువాత , ఘటన జరిగిన తరువాత హజ్రత్ అబూబకర్ రజి నివేధికను సమర్పించారు.

హజ్రత్ అబూబకర్ రజి అల్లాహ్ తాలాకు కృతజ్ఞతలు తెలిపారు. వారి కోసం దుఆలు చేశారు, అరబ్‌లు ఎల్లప్పుడు దహ్నా ప్రాంతంను గూర్చి చెప్పుకునేవారు. హజ్రత్ లుఖ్మాన్‌ను ఈ ప్రాంతంను గూర్చి, మంచి నీటి కోసం ఆ ప్రాంతాన్ని త్రవ్వుదామా? వద్దా? అని అడిగినప్పుడు వారు త్రవ్వకూడదు అని అన్నారు. ఇక్కడ ఎన్నడు మంచినీళ్ళు దొరకవు. కావున ఇక్కడ నీళ్ళ చెలిమ వెలువడడం దేవుని మహత్యం, ఒక దైవ సంకేతము అని అన్నారు. ఇలాంటి మహత్యమును గూర్చి మేము ఎన్నడు కూడ ఇతర జాతులలో వినలేదు. (తారీఖే తిబ్రి, సంపుటి 2, పుట 290, ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ లిబ్నాన్ 2012)

కేవలం అల్లాహ్ తాలా ప్రీతి కొరకు యుద్ధాలు చేయు అనుచరులకు కూడ ఇలాంటి మహత్యములు చూపించడం జరిగింది. మొత్తానికి మిగిలిన భాగాన్ని తరువాత ప్రసంగంలో తెలియజేస్తాను. ఇన్షా అల్లాహ్.

| **వర్తమాన ఖలీఫా వాఖ్యములు** | **"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. " (జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)** |
|---|---|

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

**హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి పర్యటణ నివేధిక:–**

(గత సంచిక తరువాయి భాగం)

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఇలా తెలిపారు: మస్జిద్‌ను నిర్మించిన తరువాతనే మన బాధ్యతలు ఇంకా ఎక్కువగా పెరిపోతాయనే విషయాన్ని ప్రతి అహ్మదియ్యుడు ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి. మనం ఈ మస్జిద్‌కు వచ్చి స్వతంత్ర్యముగా నమాజ్‌లు చేసుకోవాలి. మన దైవం సన్నిధిలో మోకరిల్లాలి. దయామయుడైన అల్లాహ్‌కు మనం ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాలి. అతడు అసంఖ్యాముగా అనుగ్రహించువాడు, పదే పదే అనుగ్రహించువాడు. మానవుడు తప్పులు చేస్తుంటాడు. అతని సన్నిధిలో మోకరిల్లుతుంటాడు. అల్లాహ్ తాలా కూడ తన కరుణను కురిపిస్తూ అతని వైపు శ్రద్ధను చూపుతాడు. అతని దుఆలను ఆమోదిస్తాడు. ఆ తరువాత అమితముగా అనుగ్రహిస్తాడు. కావున మనం అలా అనుగ్రహించే, పదే పదే అనుగ్రహించే ఆ దైవాన్నే ఆరాధించాలి. మనం తప్పులు చేసినకూడ, మన ప్రాయశ్చిత్తాన్ని, పాశ్చత్తాపంను మన నుండి స్వీకరించి మనలను కరుణిస్తాడు. ఆ తరువాత తన బహుమానాలతో సత్కరిస్తాడు. ఇది దేవుని లక్షణం. అతడు ఇంతగా అనుగ్రహిస్తాడు. కావున మనం కూడ అతనికి కృతజ్ఞతలు తెల్పుకోవాలి. అతని నిజమైన బోధనలను ఈ ప్రాంతంలో వ్యాపింపజేయాలి. చేరవేయాలి. ఇది ప్రతి అహ్మదీయుని యొక్క ప్రధానమైన బాధ్యత. నిజమైన ఇస్లాం బోధనలు ఈ ప్రాంతంలో వ్యాపింపజేసినప్పుడు అమీర్ సాహెబ్ తెల్పినట్లుగా ఇక్కడి ప్రాంతీయులలో ఏమైన భయాందోళనలు ఉన్నాకూడ, లేక మేయర్ గారు చెప్పినట్లుగా తీవ్రమైన భయాందోళనలు కాకుండా ట్రాఫిక్ మరియు ఇతర వ్యవస్థ పరమైన సమస్యలు ఎదురు కాబోతున్న మరేవైన ఆందోళనకర పరిస్థితులు నెలకొన్న ఈ మస్జిద్‌ను నిర్మించిన తరువాత ఆ భయాందోళనలన్నింటిని దూరం చేయవలసిన బాధ్యత ప్రతి అహ్మదీయునిపై ఉన్నది. మీ భయాందోళనలు నిజమైనవి కావని, మీకు ఎలాంటి సమస్యను రాకుండా చూసుకుంటామని, ఈ మస్జిద్‌ను నిర్మించిన తరువాత ఎలాంటి మత పరమైన దాడులు జరుగవని, ఈ మస్జిద్‌ను నిర్మించిన తరువాత నిర్వాహణ పరమైన వ్యవస్థలకు ఎలాంటి ఇబ్బందికరమైన భావాలను కల్గించమని, ఇక్కడి ప్రాంతీయులకు మా రాక వలన ఎలాంటి సమస్యను ఏర్పర్చమని మీరు ఇక్కడి జాతులతో, ఇక్కడి ప్రజలతో, ఇక్కడ నివాసయోగ్యులతో, ఇక్కడి వ్యవస్థలతో వాగ్దానం చేశారు. కావున ఇక్కడికి వచ్చిన తరువాత మేము గతంలో కన్న ఎక్కువ మానవ సేవ చేయువారమని, గతంలో కన్న ఎక్కువగా ప్రేమాభిమానాలను, సోదరభావంతో వ్యవహరిస్తాము అని, గతంలో కంటే ఎక్కువగా నిజమైన ఇస్లాం బోధనలను వ్యాపింపజేయు వారమని మీరు నిరూపించుకోవాలి.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు మరల ఇలా తెలిపారు: ఇస్లాం బోధనలు ఎంత గొప్పవి అనగా వాటిని ఎవరికైన తెలియజేసినచో విన్న వారు ప్రభావితులు గాకుండా ఉండలేరు. కొన్ని రోజుల క్రితమే నేను అమెరికా పర్యటించాను. దేశ పరిస్థితుల అవగాహన కల్గిన, ప్రపంచ ఫాలసీలు తయారు చేయగల, కాంగ్రెస్ సభ్యులైన, ప్రాంతీయులైన, గొప్పగొప్ప ఆలోచనలు గల, ప్రొఫేసర్ వంటి విద్యావంతులతో అక్కడి ఒక హొటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నాను. వారి ముందు నేను ఖుర్ఆన్ బోధనలకు మరియు ఆం హజ్రత్ సల్లల్లాహు గారి జీవిత చరిత్రకు చెందిన కొన్ని అంశాలను వివరించాను. అందుకు అందరు ముక్త కంఠంతో ఒకవేళ మీరు వివరించిన ఈ బోధనలే ఇస్లాం బోధనలైనచో ఈ బోధనలను అహ్మదియ్య జమాఅత్

సాబిర్ బుర్ఖా హౌజ్ ఖాదియాన్

SABIR BURQA HOUSE
ALL TYPES OF READYMADE BURQA
ఫోన్ ద్వారా ఆర్డర్లు పంపినచో బుర్ఖాలు
కొరియర్ ద్వారా కూడా పంపబడును
CIVIL LINES ROAD, OPP: FOUR STORY QADIAN
CONTACT NO:98884 45694 (SABIR AHMAD)

ఈ బోధనలను ప్రపంచానికి తెలిసే విధముగా చాలా విశృత స్థాయిలో వ్యాపింపజేయాలి. తద్వారా ఇస్లాం నిజమైన శాంతి, సామరస్యతలను, ప్రేమాభిమానాలను, కల్పిస్తుందని తెలుస్తుంది. కావున ఈ భావనలను గతంలో కన్న ఎక్కువగా తమ మనస్సులో పుట్టించుకోవాలి. వాటిని ఈ ప్రాంతంలో విస్తరింపజేయాలి.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు మరల ఇలా తెలిపారు: గతంలో కన్న ఎక్కువగా పరస్పరం ప్రేమాను రాగాలతో, సోదరభావంతో మెలగాలి. కేవలం అన్యులపైనే ఈ ప్రేమాభి మానాలను చూపకుండా జమాఅత్ సభ్యులపై కూడ ఈ ప్రేమాభి మానాలు చూపించాలి. ఇతరులు చూసి మీరు చెప్పేది ఒకటి చేసేది ఒకటి అని వ్రేళు ఎత్తిచూపకుండా ఉండాలి. ఇది కేవలం కల్పితమైనదిగా కాకుండా మనస్ఫూర్తిగా వెలువడుతున్నట్లుగా ఉండాలి. మనస్ఫూర్తిగా వెలువడి నప్పుడే పరస్పరం ప్రేమాభిమానాలతో ఉండాలనే ఆకాంక్ష పెరుగుతుంది. ఈ మస్జిద్‌ను నిర్మించిన తరువాత దేవుని హక్కులను చెల్లించడంతో పాటు పరస్పరం సోదరభావపు హక్కులను కూడ చెల్లించాలనే విషయాన్ని కూడ గుర్తుంచుకోవాలి. జమాఅత్ సభ్యులు కూడ ఒకరి పట్ల ఒకరు గతంలో కన్న ఎక్కువగా ప్రేమాభి మానాలను పెంచుకోవాలి. నగర వాసుల మధ్య కూడ శాంతి సామరస్యాలతో, ప్రేమగా మసులుకోవాలి. వారికి నిజమైన ఇస్లాం బోధనలను గూర్చి తెలియజేయాలి. అల్లాహ్ తాలా మీ అందరికి ఈ భాగ్యాన్ని కల్పించుగాకా! దుఆ.

8గంటల 20 నిమిషాలకు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లహు తాలా బినస్రిహిల్ అజీజ్ గారి ప్రసంగం ముగిసిపోయింది.

చివరిలో హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు దుఆ చేయించారు.

ఆ తరువాత అతిథులకు రిఫ్రెష్‌మెంట్ మరియు టీ వంటివి అందించడం జరిగింది.

ఆ తరువాత హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు మస్జిద్‌కు బయట ఉన్నటు వంటి ప్రాంగణంలో మొక్కను నాటారు. ఆ సమయంలో లార్డ్ మేయర్ గారు కూడ ఒక మొక్కను నాటారు.

ఆ తరువాత హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు మస్జిద్‌లోకి వచ్చారు. ఆ సమయంలో ప్రాంతీయ జమాఅత్ కార్యనిర్వాహక సభ్యులు మరియు ఇతర జమాఅత్ పదవి దారులు హుజూర్ అన్వర్ గారితో ఫోటో దిగే భాగ్యాన్ని పొందారు.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు మస్జిద్ నుండి బయటికి రాగా పిల్లలు ఒక బృందముగా ఏర్పడి దుఆలతో కూడిన పద్యాలను వినిపించారు. హుజూర్ అన్వర్ వారికి ప్రేమతో చాక్లెట్స్‌ను ఇచ్చారు. ఆ తరువాత జమాఅత్ సభ్యులు హుజూర్ అన్వర్‌తో కరచాలం చేయు భాగ్యాన్ని పొందారు.

ఆ తరువాత 8 గంటల 50 నిమిషాలకు అక్కడి నుండి బైతుస్సుబూహ్ ఫ్రాంక్ ఫోర్ట్‌కు బయలు దేరినారు. హుజూర్ అన్వర్ గారు సామూహిక దుఆ చేయించారు. బృంద సభ్యులు తిరుగు ప్రయాణ మైయ్యారు. పోలీస్ వాహనం ఒకటి ఎస్కాట్‌గా ముందుగా వెళ్ళింది. తిరుగు ప్రయాణంలో కూడ పోలీసులు అనేక వాహనాలు, మోటర్ సైకిళ్ళ ద్వారా మార్గ మధ్యలో ఉన్నటు వంటి వీధులను బ్లాక్ చేసి మార్గంలో నిలిచి ఉన్నారు. ట్రాఫిక్‌ను కంట్రోల్ చేస్తున్నారు. ఈ విధముగా నగర ప్రభుత్వ నిర్వాహకులు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారికి గౌరవ ప్రదమైన ప్రోటోకాల్‌ను కల్పించారు. సుమారు ఒక గంట 10 నిమిషాల ప్రయాణం తరువాత 10 గంటలకు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు బైతుస్సుబూహ్‌కు చేరుకున్నారు.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు నమాజ్ మఘ్రిబ్ మరియు ఇషాలను కల్పి చదివించారు. నమాజ్‌ల తరువాత హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు తమ నివాస గృహంలోకి వెళ్ళిపోయారు.

టీ.వి మరియు వార్త పత్రికలలో మస్జిద్ బైతుర్రహీం ప్రారంభోత్సవ వార్తలు:-

మస్జిద్ బైతుర్రహీం నూవేడ్ ప్రారంభోత్సవ వార్తలు ర్హేన్ జేటుంగ్ మరియు ఎన్.ఆర్ కురీఅర్ పత్రికలలో ప్రచురించబడ్డాయి. ఈ పత్రికలు ప్రారంభోత్సవ 13 ఫోటోలను ఆన్‌లైన్‌లో పెట్టాయి. ఇక్కడి ఒక టీ.వి చానల్ కూడ ఈ మస్జిద్ ప్రారంభోత్సవం ను గూర్చిన కథనాలను ప్రచురించింది.

ర్హేన్ జేటుంగ్ పత్రిక మస్జిద్ బైతుర్రహీం ప్రారంభోత్సవ వార్తను ఈ విధముగా వ్రాసారు:

ఖలీఫా తమ జమాఅత్ సభ్యులను ఉద్దేశించి ఈ విధముగా ప్రసంగించారు. వారు జర్మనీ ప్రజలలో మమేకమై జీవనం కొనసాగించాలి. ప్రతి అహ్మదీయుడు దేశానికి, చట్టానికి విధేయులై ఉండాలి. లార్డ్ మేయర్ ఇలా అన్నారు. ఈ జమాఅత్ నగర సమాజంలో ఒక ప్రత్యేక భాగంగా ఉ న్నది. ఒక క్రైస్తవుడు కోర్టును ఆశ్రయించాడు అని కూడ తెలిపాడు. అదే విధముగా ఈ నగరం ఈ ప్రాంతంలో మూడు పార్కులలో ఒకదానిని ఏర్పాటు చేయాలనుకున్నది కాని అధిక ప్రభుత్వాధికారులు ఇక్కడ మస్జిద్ నిర్మాణానికే ప్రాధాన్యతను ఇచ్చారు.

లార్డ్ మేయర్ మరల ఇలా తెలిపారు: జమాఅత్ యొక్క అంతర్జాతీయ్య మార్గదర్శకులు మన నగరానికి రావడం నిజానికి మనకు అపూర్వమైన గౌరవం. వారు మస్జిద్ నిర్మాణం పట్ల హర్షం వ్యక్త చేశారు. ఈ నగరం తన పూరతన సాంప్రదాయం ప్రకారం మత సామరస్యతకు నేటికి కూడ కట్టుబడి ఉన్నది. ఈ జమాఅత్ అంతర్జాతీయ్య మత సామరస్యతకు, మరియు మానవ సేవ కార్యక్రమాలలో చాలా ఉత్సాహంగా ఉన్నది. ఉదా॥ శ్రమాధానం వంటి కార్యక్రమాల ద్వారా పరిసరాల పరిశు భ్రతకు ప్రాధాన్యతనిస్తుంది.

ఎన్ఆర్ కురేయిర్ పత్రిక ఈ విధముగా ప్రచురించింది: మస్జిద్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముందు హుజూర్ అన్వర్ గారు కౌన్సిల్‌కు వచ్చారు. అక్కడ లార్డ్ మేయర్ గారు వారికి స్వాగతం పలికారు. న్యే వేడ్‌లో మత సామరస్యత చారిత్రక ప్రాధాన్యతను కల్గియున్నది. వారు ఇలా అన్నారు. మతం మానవజాతి ప్రాథమిక హక్కు. ప్రజలు ఎక్కడైతే స్వేచ్ఛగా తమ మతపరమైన ఆచారాలను ఆచరించుకుంటారో ఆ ప్రాంతానే తమ మాతృభూమిగా భావించుకుంటారు. హుజూర్ మరల ఇలా తెలిపారు. ఎల్లప్పుడు మత విశిష్టతలపై చర్చలు జరుగాలని, ఇతర మతాల వారిని దూషించకూడదని మేము కోరుకుంటున్నాము. ఇలాంటి భావనలు ఉన్న వారు అన్య మతస్థులైనను కలిసి మెలసి ఉంటారని తెలిపారు. మరల ప్రారంభోత్సవ కార్యక్రమమును గూర్చి ఇలా ప్రచురించారు: హుజూర్ ఇలా తెలిపారు: మన జమాఅత్ సభ్యులు జర్మనీ మరియు న్యేవేడ్‌లో తమ మత సాంప్రదాయాలను స్వేచ్ఛగా ఆచరించుకునే అవకాశం కల్గడం నిజంగా అల్లాహ్ అనుగ్రహంగా చెప్పుకోవచ్చును. ఈ కారణంగా మేమందరం మీకు కృతజ్ఞులమై ఉన్నాము. తాము ఉన్న ప్రతి దేశాన్ని తమ మాతృదేశముగా భావించుకొని దానికి విధేయులై ఉండడం ప్రతి అహ్మదీయుని విధి. (తదుపరి సంచికలో)

(అల్ ఫజల్ ఇంటర్నేష్నల్ 9 ఆగష్టు 2013)

99633 83271 Pro. SK.Sultan 97014 62176
Oxygen Nursery
All kind of Plants are Available.
➤ Rajahmundry
➤ Kadiyapu lanka, E.G.dist.
➤ Andhra Pradesh 533126.
➤ #email. oxygennursery786@gmail.com
Love for All..Hatred for None

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)

**హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారితో ఆస్ట్రేలియాకు చెందిన నాస్రాతుల్ అహ్మదియ్యుల ఆన్‌లైన్ భేటి.**

దివి: 21 మార్చి 2021న ఆస్ట్రేలియాకు చెందిన 13 నుండి 15 సంవత్సరాలు గల 40 మంది నాస్రాతుల్ అహ్మదియ్యులు హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ గారితో భేటి అయ్యే భాగ్యాన్ని పొందారు.

భేటి కార్యక్రమపు ప్రారంభోత్సవంలో హుజూర్ అన్వర్ గారు ఆస్ట్రేలియాలో వచ్చిన వరదలను గూర్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ (ఆస్ట్రేలియాలో) వరదలు వచ్చాయి. మీరందరు ఇక్కడికి ఎలా చేరుకున్నారు? అని అడిగారు. అందుకు లజ్నా ఇమా ఉల్లాహ్‌కు చెందిన ఒక సభ్యురాలు " హుజూర్ మేము ఏకమైన ఈ మస్జిద్‌కు మూడు వైపుల కూడ వరద నీరు ఉన్నది. మరోవైపు రోడ్డు ఉన్నా కూడ దానిపై కూడ వర్షపు నీరు ప్రవహిస్తున్నది" అని సమాధానం ఇచ్చింది. అందుకు హుజూర్ అన్వర్ గారు ఆవేదనను వ్యక్తపరుస్తూ " ఇక్కడికి వచ్చిన ఈ బాలికలు తిరిగి ఇంటికి వెళ్ళగలరా? లేక రాత్రి వేళ ఇక్కడే బస చేస్తారా?" అని అడిగారు. అందుకు లజ్నా ఇమా ఉల్లాహ్‌కు చెందిన ఒక సభ్యురాలు " హుజూర్ ఈ నిర్ణయం క్లాస్ తరువాత ఉన్న పరిస్థితులను బట్టి తీసుకుంటాము. " అని చెప్పింది. అందుకు హుజూర్ అన్వర్ గారు " అలాగైనచో మరి రాత్రికి దుప్పట్లు, చెద్దర్లు ఉన్నాయా? " అని అడిగారు. అందుకు ఆ సభ్యురాలు " దుప్పట్లు, చెద్దర్ల ఏర్పాటు ఉన్నది" అని సమాధానం ఇచ్చింది. అప్పుడు హుజూర్ అన్వర్ గారు మరల " ఒకవేళ బాలికలు ఇక్కడే రాత్రి బస చేసినచో ఉదయం వేళ వారికి టిఫిన్‌కు ఏమైన దొరుకుతాయా? లేక వరదల కారణంగా టిఫిన్‌కు ఇబ్బంది ఏర్పడుతుందా?" అని అడిగారు. అందుకు ఆ సభ్యురాలు " హుజూర్ టిఫిన్‌కు తగిన ఏర్పాట్లు కూడ అందుబాటులోకి వస్తాయి ఇన్షా అల్లాహ్ " అని సమాధానం ఇచ్చింది. (అందుకు హుజూర్ అన్వర్ గారు సంతృప్తిని వ్యక్త పరుస్తూ చిరునవ్వు చిందించారు).

ఈ కార్యక్రమంను పవిత్ర ఖుర్ఆన్ యొక్క పఠనంతో ప్రారంభించగా, తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలను (హదీస్) చదివి వినిపించారు. ఆ తరువాత హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి ఒక ఉపదేశాన్ని చదివి వినిపించడం జరిగింది. ఆ తరువాత ఒక పద్యాన్ని వినిపించారు. ఒక గంటపాటు కొనసాగిన ఈ కార్యక్రమములో నాసిరాతుల్ అహ్మదియ్యులకు హుజూర్ అన్వర్ గారిని కొన్ని ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకునే భాగ్యం లభించింది.

ప్రశ్న: 'ప్రియమైన హుజూర్! పురుషులు అందుబాటులో లేని సమయంలో ఏ మహిళ అయినా ఖుర్బాని జంతువును కోయవచ్చునా?" అని ఒక బాలిక ప్రశ్నించింది.

సమాధానం: "ఆం , నీవు కూడ కోయవచ్చును. ఒకవేళ నీలో ఖుర్బాని జంతువును కోసేఅంత ధైర్యం ఉన్నచో నీవు కూడ ఖుర్బాని జంతువును కోయవచ్చును. ఇందులో ఎలాంటి సమస్య లేదు. కాని గుర్తుంచుకోవలసిన విషయం ఏమనగా కత్తి చాలా పదునుగా ఉండాలి. పూర్తి బలాన్ని ఉపయోగించి కోయాలి. తద్వారా జంతువుకు ఎలాంటి బాధ కల్గకూడదు. వేగంగా ఒకేసారి దానిని కోయాలి. అందుకే ఒకవేళ నీకు అంత ధైర్యం ఉన్నచో తప్పకుండా కోయవచ్చును." అని హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు సమాధానం ఇచ్చారు. (హుజూర్ అన్వర్ చిరునవ్వు చిందిస్తూ), కేవలం పురుషులే ఖుర్బాని జంతువును కోయాలని నీతో ఎవరు అన్నారు? అని అడిగారు.

ప్రశ్న: "పాఠశాల విద్యతో పాటు ధార్మిక విద్యను ఏ విధముగా కొనసాగించ వచ్చును?" అని ఒక బాలిక అడిగిన ప్రశ్నకు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఇలా సమాధానం ఇచ్చారు.

సమాధానం: మీరు ముందుగా ఎక్కువ సమయాన్ని పాఠశాల విద్య కోసం కేటాయించాలి. ఒక గంట లేదా ఆరగంట సమయం నాసిరాతుల్ అహ్మదియ్య సెలబస్ కోసం లేదా ఇస్లామీయ బోధనలతో కూడిన పుస్తకాలను చదవడానికి కేటాయించినచో సరిపోతుంది. అందుకే ఒక గంట లేదా రెండు గంటల సమయం ఎంత సమయం పాఠశాల విద్యకు చెందిన హోమ్‌వర్క్‌కు వెచ్చించ వలెనో అంత సమయాన్ని వెచ్చించవలెను. ఆ తరువాత ఒక గంట లేదా అరగంట సమయాన్ని ధార్మిక విషయాలను తెలుసుకోవడానికి వెచ్చించినచో సరిపోతుంది. ఈ విధముగా మీ పాఠశాల విద్యతో పాటు ధార్మిక విద్య రెండింటి హక్కును చెల్లించవచ్చును.

ప్రశ్న: " హుజూర్ అన్వర్ సహ్‌రీ మరియు ఇఫ్తారీలో ఎలాంటి ఆహారాన్ని తీసుకోవడాన్ని ఇష్టపడుతారు?" అని ఒక బాలిక అడిగిన ప్రశ్నకు హుజూర్ అన్వర్ గారు ఇలా సమాధానం ఇచ్చారు.

సమాధానం: నేను సాధారణంగా రోజు చేసే టిఫిన్‌నే సహ్‌రీ కోసం భుజిస్తాను. రాత్రి భోజనానికి ఇష్టపడే వంటకాలనే ఇఫ్తారీలో భుజిస్తాను. ఇది ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి సాంప్రదాయం. సాధారణంగా నేను ఇఫ్తారీలో ఖర్జూరనే తీసుకుంటాను. సాధారణంగా కొందరు అనవసరమైన వంటకాలను భుజిస్తుంటారు. ఉదా॥సమోస, పకోడి, చాట్ వంటి పిండి పదార్థాలను తీసుకుంటారు. నేను మాత్రం ఇలాంటి అనవసర పదార్థాలను అస్సలు భుజించను. ఇఫ్తారీ తరువాత ఇబ్బంది కల్గించే విధముగా లేక ఉదయం వేళ సహరి కోసం మేల్కోవడంలో ఇబ్బంది కల్గే విధముగా కూడ నేను భుజించను. అందుకే ఒక క్రమబద్ధమైన అలవాటు ఉండాలి. హుజూర్ అన్వర్ గారు మరల ఇలా అన్నారు: రమజాన్ ఉపవాసాలలో సహ్‌రీ మరియు ఇఫ్తారీలలో ప్రత్యేకమైన వంటకాలను తప్పకుండా భుజించాలని ఒక సమాజిక సాంప్రదాయాన్ని ఏర్పాటు చేసుకున్నాము. ఈ విధముగా ఒకవైపు మనం అనవసరమైన ఖర్చులను పెంచుకుంటాము. పైగా కడుపులో కూడ గడబిడలు. ఈ విధముగా ఉపవాసం ఉన్నచో ఆ రోజంతయు మీకు నీరసంగానే ఉంటుంది. మీరు సాధారణ రోజులలో తీసుకునే ఆహారంతోనే సహ్‌రి మరియు ఇఫ్తారీలు చేసినప్పుడు, దానికి తోడుగా మీరు చేసే వృధా ఖర్చులను పూర్తిగా తగ్గించుకొని ఆ నగదును దానధర్మాల కోసం ఖర్చు చేసినప్పుడే మీకు నిజమైన ఉపవాసపు మాదుర్యం లభిస్తుంది.

ప్రశ్న: " విశ్వాసుని కొరకు ఈ ప్రపంచం ఒక కారాగారం అని అవిశ్వాసుని కొరకు ఈ ప్రపంచం ఒక స్వర్గమని ఉన్న హదీస్‌ను ఆధారం చేసుకొని హుజూర్! ఒకవేళ ఒక వ్యక్తి తన ధార్మిక విధులను నెరవేర్చుకుంటూ ఈ ప్రాపంచిక వస్తువుల నుండి సౌకర్యాన్ని సుఖాన్ని పొందినచో అతడు నిష్టాపరుడు కదా?" అని ఒక బాలిక అడిగిన ప్రశ్నకు హుజూర్ అన్వర్ గారు ఇలా సమాధానం ఇచ్చారు.

సమాధానం: " ఈ హదీస్ యొక్క అర్థమేమనగా, ఒక నిష్టాపరత గల మానవుడు ధార్మిక బోధనలపై, ఆరాధానలపై, ధార్మిక విధుల నిర్వాహణపై ప్రాపంచిక వస్తువులకు ఏ మాత్రం ప్రాధాన్యతను ఇవ్వడు. ఒకవేళ మీరు ధర్మమునకు ప్రాపంచికతపై ప్రాధాన్యతను ఇస్తున్నారు, 5 పూటల నమాజ్‌లను పూర్తి శ్రద్ధతో సల్పుచున్నారు, మీ నమాజ్‌లను భక్తి శ్రద్ధలతో సల్పుతున్నారు, ఇస్తాఘ్‌ఫారుల్ చేస్తున్నారు, అల్లాహ్ తాలాను రోజంతయు గుర్తు చేసుకుంటున్నారు, చెడు పనులకు దూరంగా ఉంటున్నారు, వీటికి తోడుగా ఉధ్యోగాలు చేసుకుంటున్నారు, ధర్మబద్ధమైన ఆధాయంను సంపాదించుకుంటున్నారు, ఒకవేళ ధనమును సంపాదిస్తున్నప్పుడు, ప్రాపంచిక వస్తువులతో సౌకర్యాన్ని పొందుతున్నారు , మీరు మీకు ఇష్టమైన వాహనాలను వాడుకుంటున్నారు, మీకు నచ్చిన దుస్తువులు ధరిస్తున్నారు, మీరు కోరుకున్న ఇంట్లో ఉంటున్నారు. ఇవన్నియు నేటి కాలపు జీవితాన్ని గడపడానికి కావలసిన వస్తువులు. ఇవి మీకు సౌకర్యాన్ని , సౌలభ్యాన్ని అందిస్తుంటాయి. మీరు వాటి నుండి అనుభూతిని, ఆనందాన్ని పొందుతారు. కాని మీరు కేవలం ఈ వస్తువుల కోసమే పరుగెత్తకూడదు. అలా పరుగెత్తుతూ అల్లాహ్‌ను మర్చిపోయే పరిస్థితి రాకూడదు. ఒకవేళ మీరు అల్లాహ్ తాలాను గుర్తు చేసుకుంటూ ఈ వస్తువులను సాధించుకొనుచున్నచో, మీ జీవితాలను మీ కోసం, మీ పిల్లల కోసం సౌకర్యవంతముగా తీర్చి దిద్దుకొనుచున్నచో ఎలాంటి అభ్యంతరం ఉండదు. ఈ హదీస్ యొక్క అర్థమేమనగా, ఎవరైతే ఈ ప్రపంచాన్ని శాశ్వతమని భావించుకుంటున్నారో, దేవున్ని హక్కులను చెల్లించకుండా ఉంటారో అలాంటి వారి కొరకు ఈ ప్రపంచం ఒక నరకంలా మారిపోతుంది. చూడడానికి ఇది స్వర్గంలా కనిపించినా అల్లాహ్ తాలా దృష్టిలో ఇది నరకంలాగే ఉంటుంది. హుజూర్ అన్వర్ మరల ఇలా వివరించారు: వాటి అన్నింటికి భిన్నముగా ఒక

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక

Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA

POSTAL REG NO GDP-38/2020-2022, Vol. 7. Thursday, 18 AUG 2022 Issue No. 33.

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail:managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

వ్యక్తి ఎల్లప్పుడు దేవుని హక్కులను, అతని దాసుల హక్కులను చెల్లించు వాడై ఉంటాడు. అదే విధముగా అల్లాహ్ తాలా యొక్క ఇతర అనేక ఆదేశాలను కూడ పాటించు వాడై ఉంటాడు. నిజానికి అతని కొరకు ఈ ఆదేశాలు ఉన్నవి ఉన్నట్లుగా ఆచరించాలని చూసినచో కష్టతరమవుతుంది. కొన్ని సందర్భాలలో ఇబ్బంది కూడ కల్గుతుంది. అలాంటి వారి కొరకు ఈ ప్రపంచం నరకంలా ఉంటుందని ప్రజలు భావిస్తుంటారు. కాని అల్లాహ్ తాలా మాత్రం ఇలాంటి వారు ప్రళయ దినమున తమ కోసం స్వర్గాన్ని సిద్ధం చేసుకుంటున్నారని తెల్పుచున్నాడు. అందుకే మీరు ఈ ప్రాపంచిక సామాగ్రితో, సాధానలతో లాభాన్ని, ప్రయోజనాన్ని పొందుచూ కూడ మీరు దేవుని హక్కులను అతని ఆదేశాలను పాటించాలనే ఆలోచనలను కల్గియుండాలి. " అని హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు సమాధానం ఇచ్చారు.

ప్రశ్న: "ఒక వ్యక్తి అహ్మదియ్యత్‌ను విశ్వసించి, అహ్మదియ్య బోధనలకు అనుగుణముగా నడుచుకుంటున్నాడు. కాని అతడు బైఅత్ చేయలేదు. ఇలాంటి పరిస్థితులలో అతడు లేదా ఆమే ఆహ్మదీయులు అనడానికి అర్హులా? కాదా?" అని ఒక బాలిక అడిగిన ప్రశ్నకు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఈ విధమైన సమాధానంను ఇచ్చారు.

సమాధానం:- ఒకవేళ అతడు అహ్మదియ్యత్‌ను విశ్వసించుతున్నాను అని ప్రకటించుకుంటూ బైఅత్ చేయడం లేనిచో దాని అర్థం అతడు జమాఅత్‌లో చేరడానికి కావాలసిన నిబంధనల నుండి దూరంగా ఉండాలను కుంటున్నాడు. తనను విశ్వసించు ప్రతివ్యక్తి బైఅత్ చేయాలని, అప్పుడే అతడు జమాఅత్‌లో భాగస్వాముడవుతాడనని, పూర్తి స్థాయిలో జమాఅత్ ఒడిలోకి చేరుతాడని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు తెలిపారు. ఆ తరువాత అతడు జమాఅత్ నియమ నిబంధనలను అనుసరించి పూర్తి స్థాయిలో అనుసరించడానికి ప్రయత్నిస్తాడు. ఒకవేళ అతడు నేను అహ్మదియ్యత్‌ను విశ్వసించుతున్నాను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహి స్సలాతు వస్సలాం గారు సత్యవంతులని విశ్వసించుచున్నాను. తరువాత కాలంలో అవతరించ వలసిన వాగ్దాత అవతారులు కూడ వారే అని విశ్వసించుతున్నాను. వీరి గూర్చియే ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం శుభవార్తలను అందించారని ప్రకటిస్తూనే అతడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారి హస్తాలపై బైఅత్ చేయకుండా వారి ఖలీఫాల చేతులపై బైఅత్ చేయకుండా అతడు ఒక విధానంను అనుసరించి జమాఅత్‌లో పాల్గొననిచో అప్పుడు మనం అతనిని ఒక మంచి వ్యక్తి అని చెప్పుకుంటాము కాని అతనిని మాత్రం అహ్మదీయుడని చెప్పుకోలేము. బైఅత్ చాలా తప్పనిసరి. ఎందుకనగా పవిత్ర ఖుర్ఆన్‌లో కూడ ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం బైఅత్ తీసుకునేవారని కూడ తెల్పడం జరిగింది. ఆ తరువాత హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారు కూడ బైఅత్ తీసుకున్నారు. ఇది హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారు ప్రారంభించినటు వంటి ఒక గొప్ప వ్యవస్థ. బైఅత్ చేసినప్పుడు మాత్రమే బైఅత్ నిబంధనలకు అనుగుణముగా నడుచుకోగలరు. ఇందుకోసమే బైఅత్ కొరకు కూడ కొన్ని నిబంధనలు ఉంటాయి. మీరు బైఅత్ చేసినప్పుడు వాటిని కూడ తప్పకుండా ఆచరించవలసి ఉంటుంది. ఒకవేళ బైఅత్ చేసిన తరువాత కూడ మీరు ఆ నిబంధనలను పాటించనిచో అప్పుడు మనం వారు కేవలం నోటితో బైఅత్ చేశాడు కాని వారు బైఅత్ అసలైన బోధనలకు అనుగుణముగా నడుచుకోవడం లేదు అని అనగలము. అందుకే ఒకరు బైఅత్ చేసి కూడ బైఅత్ నిబంధనలను పూర్తి చేయనిచో అతడు కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారిని విశ్వసించు నిబంధనలను పూర్తి చేయడం లేదు అని చెప్పుకోగలము. హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు మరల ఇలా తెలిపారు. ఇందుకోసమే నేను బైఅత్ నిబంధనల ఆధారంగా ప్రసంగాల పరంపరను ప్రారంభించాను. ఇతర కొన్ని సందర్భాలలో కూడ ఆయా నిబంధనలను గూర్చి ప్రసంగించాను. మీరు నా ఆ బైఅత్ నిబంధనల పుస్తకాన్ని చదవాలి. అప్పుడే మీకు కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను విశ్వసించిన తరువాత మరియు బైఅత్ చేసిన తరువాత మీపై ఎలాంటి బాధ్యతలు ఉన్నాయో తెలుస్తుంది. "

**నూరుల్ ఇస్లాం శాఖ:**

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**

**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**

**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలువు).**

ప్రశ్న: నేను నా తోటి విద్యార్థురాళ్ళకు దైవ ఉనికి ఆధారం కొరకు ఎలాంటి సాక్ష్యాలను ఇవ్వాలి? అని ఒక బాలిక అడిగిన ప్రశ్నకు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఈ విధముగా సమాధానం ఇచ్చారు.

సమాధానం:-మత విషయంలో అనుమానాలకు పాల్పడుచున్నవారికి నాస్తికులకు తమ స్వీయానుభూతి గల దుఆల ఆమోదిత ఘట్టాలను గూర్చి వినిపించాలి. ఆ తరువాత హుజూర్ అన్వర్ గారు ఆ బాలికను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడైన నీ దుఆలు ఆమోదించబడ్డాయా? అని అడిగారు. అందుకు ఆ బాలిక హుజూర్ ఆమోదించబడ్డాయి అని సమాధానం ఇచ్చింది. అందుకు హుజూర్ అన్వర్ గారు "అలాగైనచో నీవు నీ స్నేహితురాళ్ళకు నేను అల్లాహ్ తాలాతో ఈ విధముగా దుఆ చేశాను. అతడు నా దుఆలను ఈ విధముగా ఆమోదించాడు అనే విషయాన్ని చెప్పాలి, త ద్వారా అల్లాహ్ తాలా ఉన్నాడు అని ఋజువు అవుతుంది. మీరు మన దేవుడు (హమార ఖుదా) అనే పుస్తకాన్ని కూడ చదవాలి. మీకు ఆ పుస్తకంలో దేవుడు ఉన్నాడనడానికి చాలా ఆధారాలు లభిస్తాయి. ఆ తరువాత మీరు హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ తాలా అన్‌హు గారి దైవ ఉనికి కోసం 10 నిదర్శనాలు అనే పుస్తకాన్ని చదవాలి. అన్నిటి కంటే ముఖ్యమైన విషయమేమనగా మీరు మీ ఉదాహరణలను ఇవ్వాలి. నేను దేవునిపై పూర్తి విశ్వాసాన్ని కల్గియున్నాను. నేను ఎప్పుడు దేవునితో దుఆ చేసిన కూడ అతడు నా దుఆలను ఆలకిస్తాడు. ఆ దుఆల ఆమోదితము కూడ నా విశ్వాసాన్ని ఇంకా పటిష్టం చేస్తుంది అని చెప్పాలి" అని తెలిపారు.

ప్రశ్న:- ఒక బాలిక తలపై స్కార్ఫ్ ధరించడాన్ని గూర్చి ప్రశ్నించగా అందుకు సమాధానంను హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా ఈ విధముగా ఇచ్చారు.

సమాధానం:-ఒకవేళ ఇతరులు ఎవరైన నీవు ఎందుకు స్కార్ఫ్‌ను ధరించావు ? అని అడిగినచో నీవు వారికి "మా మతం యొక్క ప్రాథమిక బోధన సంస్కారం. కావున మేము ఎల్లప్పుడు సంస్కార వంతమైన దుస్తువులనే ధరిస్తుంటాము. అందుకే మేము తలపై స్కార్ఫ్‌ను చుట్టు కుంటాము. ఇలా చుట్టుకోవడం కూడ సంస్కార వంతమైన వస్త్రాలంకరణలో భాగమే అనబడుతుంది. అందుకే పూర్వపు కాలంలో క్రైస్తవ నన్స్‌లు కూడ తలపై స్కార్ఫ్‌లు ధరించేవారు. నేడు కూడ చర్చిలలో ఇలాగే ధరిస్తుంటారు. దీని ద్వారా కూడ స్కార్ఫ్ ధరించడం అనేది సంస్కారవంతమైన వస్త్రాలంకరణ అని అర్థమవుతుంది. అందుకే మేము కూడ స్కార్ఫ్‌ను ధరిస్తాము" అని సమాధానంను ఇవ్వండి అని అన్నారు.

**(రాబోవు సంచికలో)**

☆☆☆☆☆

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz